JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । శనివారం 28-03-2026
Medchal - Malkajgiri । Saturday 28-03-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 300
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 300 । Pages : 8 । ₹: 5






# సీతారాముల కల్యాణం

## సమస్త జనులకు కమనీయం.. సకల శుభాల సంవేదం

## పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం రేవంత్ దంపతులు

దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలంలో కాసేపట్లో లోకకల్యాణానికి సర్వం సిద్ధమైంది. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో కల్యాణ బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా సాగుతున్నాయి. సీతారాముల కల్యాణానికి ఆధ్యాత్మికత ఉట్టిపడేలా.. భక్తకోటి మురిసేలా ఘనంగా ఏర్పాట్లు చేశారు. రాములోరి కల్యాణఘట్టాన్ని ప్రత్యక్షంగా కన్నులారా వీక్షించి తరించేందుకు భక్తకోటి పెద్దఎత్తున తరలివస్తుంది.




## తన గురువు డా. జైశెట్టి రమణయ్య మరణం పట్ల కేసీఆర్ సంతాపం




జయభేరి, హైదరాబాద్ :

తనకు చదువు చెప్పిన గురువు, జగిత్యాలకు చెందిన ప్రముఖ చరిత్రకారుడు, రిటైర్డ్ లెక్చరర్ డా. జైశెట్టి రమణయ్య మరణం పట్ల, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విచారం వ్యక్తం చేస్తూ, సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా తనకు గురువుగా, అత్యంత ఆత్మీయుడైన రమణయ్య తో తనకున్న అనుబంధాన్ని కేసీఆర్ స్మరించుకున్నారు. రమణయ్య సిద్దిపేటలో లెక్చరర్గా పనిచేస్తున్న సమయంలో, తను ఇంటర్మీడియట్ విద్యార్థిగా తన దగ్గర విద్యనభ్యసించిన సందర్భాన్ని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. అయన మరణంతో శోకతప్త హృదయులైన కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రమణయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కాగా.. 1971లో సిద్దిపేటలో జూనియర్, డిగ్రీ కాలేజీలో హిస్టరీ లెక్చరర్గా డా. జైశెట్టి రమణయ్య పని చేశారు. చిన్న వయసులోనే ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన అరుదైన వ్యక్తిగా, జగిత్యాలలో మొట్టమొదట డాక్టరేట్ పొందిన పరిశోధన విద్యార్థిగా అయనకు కి పేరున్నది. "సౌత్ ఇండియా టెంపుల్స్" అనే పరిశోధనాత్మక గ్రంథాన్ని సమర్పించి జైశెట్టి రమణయ్య పీహెచ్డీ డాక్టర్ పట్టాను పొందారు.

## బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పోటీ ప్రచారం

- రాజకీయాల్లో శాశ్వత మిత్రులు కానీ, శాశ్వత శత్రువులు ఉండరు
- అధికార కాంగ్రెస్ పార్టీ మాత్రం బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని చాలాకాలంగా విమర్శిస్తోంది
- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ను ఓడించేందుకు ఆ రెండూ తప్పకుండా కలుస్తాయన్నా హస్తం నేతలు




జయభేరి, హైదరాబాద్, మార్చి 27 :

తెలంగాణలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగే అవకాశం లేదు. అయినా పొత్తుల ఊహాగానాలు మాత్రం ఊపందుకున్నాయి. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నాయంటూ కొంతకాలంగా గుసగుసలు జోరందుకున్నాయి. ఇందుకు కొంతమంది నేతల వ్యాఖ్యలు కూడా కారణం. అయితే పొత్తుపై అటు బీజేపీ కానీ, ఇటు బీఆర్ఎస్ కానీ అధికారికంగా ఎలాంటి ప్రకటనలూ చేయట్లేదు. నేతల మాటలతో ఇలాంటి ఊహాగానాలు మాత్రం రోజురోజుకూ బంధంపై బలపడుతున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత జరిగిన లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. ...మిగతాది 2 లో

# మహిళా లీడర్లు కావలెను

2 లో



# ఇంధన భద్రతపై భరోసా..

అగ్రరాజ్యం అమెరికా, ఇజ్రాయెల్ వర్సెస్ ఇరాన్ మధ్య రేగుతున్న చిచ్చు ప్రపంచ ఇంధన మార్కెట్‌ను వణికిస్తోంది. ముఖ్యంగా కీలకమైన హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు పెరుగుతుండటంతో 140 కోట్ల మంది భారతీయుల ఇంధన అవసరాలపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్లిష్ట సమయంలో దేశాన్ని ముందస్తుగా సిద్ధం చేసేందుకు స్వయంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రంగంలోకి దిగారు.

- సీఎంలతో ప్రధాని మోదీ కీలక భేటీ
- హోర్ముజ్ జలసంధిలో భారత నౌకల సేఫ్ పాసేజ్
- తప్పుడు ప్రచారాలను నమ్మకండి

జయభేరి, న్యూఢిల్లీ:

పశ్చిమాసియాలో ఇజ్రాయెల్, అమెరికా, ఇరాన్‌ల మధ్య ఫిబ్రవరి 28 నుండి కొన సాగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాపై నీలి నీడలు కమ్ముకునేలా చేశాయి. ఈ నేపథ్యంలో దేశంలో ఇంధన భద్రతను సమీక్షించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రంగంలోకి దిగారు. యుద్ధం కారణంగా ఎదురయ్యే సవాళ్లు, రాష్ట్రాల సన్నద్ధతపై ఆయన వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ముఖ్యమంత్రులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి కూడా ఈ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ పలు కీలక సూచనలు చేశారు. అయితే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున, ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ సమావేశానికి హాజరు కాలేదు. ఈ సంక్షోభం జాతీయ ప్రాధాన్యత ...మిగతాది 2 లో

# ఏపీలో నియోజకవర్గాల పునర్విభజన



- మారిపోనున్న ఉమ్మడి కృష్ణా జిల్లా రుపరేఖలు
- కొత్త పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలు ఇవేనా?

జయభేరి, అమరావతి, మార్చి 27 :

దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల సంఖ్యను 50శాతం పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు త్వరలోనే బిల్లును సైతం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ కొత్తగా పెరిగిన సీట్లతోనే 2029 ఎన్నికలకు వెళ్లాలనే యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఏపీలో అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలు సైతం పెరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి కృష్ణా జిల్లా ముఖచిత్రంపై ఓ కథనం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విజయవాడలో ప్రస్తుతం ఉన్న 2 పార్లమెంట్ 14 అసెంబ్లీ నియోజకవర్గంలు పునర్విభజన తర్వాత 3 పార్లమెంట్ 21 అసెంబ్లీ నియోజకవర్గాలుగా మారుతుంది అంటూ ఓ పోస్ట్ తెగ వైరల్ అవుతుంది. ఈ అంచనాలు కేవలం జియోగ్రాఫికల్ అంచనాలు మాత్రమే అని ప్రభుత్వం నుండి పునర్విభజన అనేది జనాభా ప్రాతిపదికన సైంటిఫిక్ తరహాలో జరుగుతుంది అని రాసి ఉంది. కొత్త నియోజకవర్గాలతో ఉమ్మడి కృష్ణా జిల్లా ముఖచిత్రం ఈ విధంగా మారబోతుంది.

**మచిలీపట్నం పార్లమెంట్ :**

1.అవనిగడ్డ,(అవనిగడ్డ,నాగాయలంక, కోడూరు)
2.చల్లపల్లి,(చల్లపల్లి,ఘంటసాల,మోపిదేవి)
3.మచిలీపట్నం,(సిటీ)
4.గుడివాడ,(గుడివాడ సిటీ,నందివాడ)
5.పామర్రు,(పామర్రు,పమిడిముక్కల,పెదపారుపూడి) ...మిగతాది 2 లో



## పెట్రోల్, డీజిల్ ధరలపై కేంద్రం మరో కీలక ప్రకటన

జయభేరి, న్యూఢిల్లీ:

పెట్రోల్, డీజిల్ ధరలపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. వీటి ధరలను 15 రోజులకు ఒకసారి సమీక్షిస్తామని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని సెంటర్ల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ ఛైర్మన్ వివేక్ చతుర్దేతి తెలిపారు. ఇక డీజిల్, ఎటీఎఫ్‌లపై అదనపు సుంకాలను విధించామని, దీని వల్ల 15 రోజుల్లో ప్రభుత్వానికి రూ.1500 కోట్ల ఆదాయం లభిస్తుందన్నారు. దేశంలో వాటిని అందుబాటులోకి ఉంచడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇక పెట్రోల్, డీజిల్ ధరలపై కేంద్రం ఎక్సైజ్ సుంకం తగ్గించడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం తగ్గుతుందన్నారు. 15 రోజుల్లో దాదాపు రూ.7 వేల కోట్ల ఆదాయం ప్రభుత్వం కోల్పోతుందని వెల్లడించారు. ...మిగతాది 2 లో



## రేవంత్ మార్క్ పాలిటిక్స్

- జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పేందుకు సరికొత్త ఆయుధం.. ‘డీలిమిటేషన్’
- అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు శిక్ష.. జనాభా పెంచిన వారికి బహుమతా?
- రేవంత్ రెడ్డి ఈ పోరాటంలో దక్షిణాది రాష్ట్రాలను ఏకం చేయగలరా? లేదా జాతీయ రాజకీయాల ఒత్తిడిలో తన స్వరాన్ని తగ్గించుకుంటారా?

జయభేరి, హైదరాబాద్, మార్చి 27 :

తెలంగాణ గడ్డపై పాలనతో బిజీగా ఉండే సీఎం రేవంత్ రెడ్డి హస్తినలో అడుగుపెట్టగానే రూటు మారుస్తున్నారు. జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పేందుకు ఆయన ఎంచుకున్న సరికొత్త ఆయుధం.. ‘డీలిమిటేషన్’ (నియోజకవర్గాల పునర్విభజన). దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలే పరమావధిగా ఆయన వినిపిస్తున్న నినాదం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే జనాభా ప్రాతిపదికన సీట్ల సంఖ్య పెరుగుతుంది. ఇక్కడే రేవంత్ రెడ్డి ఒక బలమైన పాయింట్‌ను తెరపైకి తెచ్చారు. దక్షిణాది ...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఇంధన భద్రతపై భరోసా..

కలిగిన అంశం కావడంతో ప్రభుత్వం ఇప్పటికే అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి అన్ని పార్టీల అభిప్రాయాలను తీసుకుంది. ప్రధాని మోదీ స్వయంగా పార్లమెంటు ఉభయ సభల్లో పశ్చిమ ఆసియా పరిస్థితిపై ప్రకటన చేసి దేశ ప్రజలకు భరోసా కల్పించారు.

**హోర్ముజ్ జలసంధిలో భారత నౌకల సేఫ్ పాసేజ్**

భారతదేశ ఇంధన అవసరాల్లో మెజారిటీ భాగం హోర్ముజ్ జలసంధి గుండానే వస్తుంది. యుద్ధం నేపథ్యంలో ఈ మార్గం అత్యంత కీలకంగా మారింది. ఎల్‌పీజీ నిల్వలతో ఉన్న 4 భారతీయ నౌకలు హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటి ఇప్పటికే భారత్‌కు చేరుకున్నట్లు విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. భారత నౌకల రక్షణ కోసం ప్రభుత్వం నిరంతరం సంబంధిత దేశాలతో సంప్రదింపులు జరుపుతోంది. 140 కోట్ల మంది ప్రజల అవసరాలు, అంతర్జాతీయ మార్కెట్ హెచ్చుతగ్గులను బేరీజు వేసుకుంటూ భారత్ తన ఇంధన సేకరణ వ్యూహాన్ని అమలు చేస్తోంది.

**తప్పుడు ప్రచారాలను నమ్మకండి**

దేశంలో పెట్రోల్, డీజిల్ లేదా గ్యాస్ కొరత ఏర్పడుతుందనే వార్తలను పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. అన్ని రిటైల్ ఇంధన కేంద్రాల్లో తగినంత స్టాక్ ఉంది. సరఫరా వ్యవస్థ పూర్తిగా నియంత్రణలో ఉంది. కొందరు కావాలనే ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకు దురుద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, పౌరులు అటువంటి వార్తలను నమ్మవద్దని మంత్రిత్వ శాఖ కోరింది.

**భారత నిర్ణయాల్లో కీలక సూత్రాలు**

భారతదేశం తన ఇంధన భద్రత విషయంలో మూడు ప్రధాన సూత్రాలను అనుసరిస్తోంది.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిరంతరం సరఫరా.. అంతర్జాతీయ ధరల ప్రభావం సామాన్యుడిపై పడకుండా చూడటం.. యుద్ధ వాతావరణంలో దౌత్యపరమైన సంబంధాలను ఉపయోగించుకుని చమురు దిగుమతులను సులభతరం చేయడం.

## కేంద్రం మరో కీలక ప్రకటన

దేశంలో ఇంధన కొరత ఏర్పడుతుందనే క్రమంలో కేంద్రం చర్యలు చేపట్టింది. ఎక్సైజ్ సంకాన్ని భారీగా తగ్గించింది. ఇప్పటివరకు పెట్రోల్, డీజిల్‌పై ఉన్న ఎక్సైజ్ సుంకాన్ని రూ.10 మేర తగ్గించింది. వీటి వల్ల ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలగనప్పటికీ.. ఆయిల్ కంపెనీలు నష్టాలను పూడ్చుకోవడానికి ఉపయోగపడనుంది. యుద్ధ పరిస్థితుల క్రమంలో ఇంధన రవాణాకు అంతరాయం కలగడంతో పాటు ముడి చమురు ధరలు భారీగా పెరిగాయి. దీని వల్ల ఆయిల్ కంపెనీలు ఎక్కువగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. దీంతో కంపెనీలకు నష్టాలను తగ్గించేందుకు కేంద్రం సుంకాలను తగ్గించింది. డీజిల్‌పై సుంకాన్ని సున్నాకు పరిమితం చేసింది. ఇక ఎగుమతులను అరిట్టేందుకకు డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్‌పై సుంకాన్ని పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

అటు ఇంధన నిల్వలపై చర్చించేందుకు శుక్రవారం అన్ని రాష్ట్రాల సీఎంలతో ప్రధాని మోదీ సమావేశం అయ్యారు. దేశంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరతపై జరుగుతున్న ప్రచారంపై చర్చించారు. కొరత రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కీలక సూచనలు చేశారు. ప్రజలు భయపడకుండా అవగాహన కల్పించాలని సూచించారు. దేశంలో పుష్కలంగా ఇంధన నిల్వలు ఉన్నాయని, ఆందోళన పడాల్సిన అవసరం లేదని సూచించారు.

## రేవంత్ మార్క్ పాలిటిక్స్

రాష్ట్రాలు దశాబ్దాలుగా కేంద్రం చెప్పినట్లు కుటుంబ నియంత్రణను పాటించి జనాభాను అదుపు చేశాయి. కానీ, ఇప్పుడు జనాభా పెరిగిన ఉత్తరాది రాష్ట్రాలకే (యూపీ, బీహార్ వంటివి) ఎక్కువ ఎంపీ సీట్లు కేటాయిస్తే, అది క్రమశిక్షణ పాటించిన దక్షిణాదికి అన్యాయం చేసినట్లే అవుతుంది. "అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు శిక్ష.. జనాభా పెంచిన వారికి బహుమతా?" అన్న రేవంత్ ప్రశ్న ఇప్పుడు దక్షిణ భారతాన్ని ఆలోచింపజేస్తోంది.రేవంత్ రెడ్డి తీస్తున్న ఈ 'సౌత్ సెంటిమెంట్' కాంగ్రెస్ అధిష్టానాన్ని ఇరకాటంలో పడేస్తోంది. నార్త్ వర్సెస్ సౌత్‌గా పరిస్థితి మారుతోంది. రేవంత్ వ్యాఖ్యలను గట్టిగా సమర్థిస్తే.. ఉత్తరాది రాష్ట్రాల్లోని ఓటర్లు తమను కించపరుస్తున్నారని భావించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా రాహుల్ గాంధీ ఉత్తరాదిన పార్టీని బలోపేతం చేయాలని చూస్తున్న తరుణంలో ఈ ప్రాంతీయ భేదాలు పార్టీ జాతీయ ప్రతిష్టకు విఘాతం కలిగించవచ్చు. అందుకే రేవంత్ దూకుడుపై అధిష్టానం ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ముద్ర వేయకుండా ఆచితూచి అడుగులు వేస్తోంది. గతంలో కేసీఆర్ కూడా జాతీయ రాజకీయాల కోసం 'బీఆర్ఎస్' పెట్టి చేతులు కాల్చుకున్నారని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. అయితే రేవంత్ వ్యూహం భిన్నంగా ఉంది. ఆయన కేవలం పార్టీ లైన్ కాకుండా ప్రాంతీయ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నారు. దక్షిణాది ఎంపీల సంఖ్య తగ్గితే భవిష్యత్తులో కేంద్రం నుంచి వచ్చే నిధులు, రాజకీయ ప్రాతినిధ్యం కూడా తగ్గిపోతాయని ఆయన హెచ్చరిస్తున్నారు. కేసీఆర్ మాదిరిగా ఉత్తరాదిలో పార్టీని విస్తరించడం కంటే, దక్షిణాది నేతలను ఏకం చేసి కేంద్రంపై ఒత్తిడి తేవడమే రేవంత్ అసలు ప్లాన్ అని అర్థమవుతోంది. ఉత్తరాదిన తిరుగులేని బలం ఉన్న బీజేపీకి, రేవంత్ లేవనెత్తిన ఈ అంశం పెద్ద తలనొప్పిగా మారే అవకాశం ఉంది. ఒకవేళ దక్షిణాది రాష్ట్రాలు నిజంగానే ఏకతాటిపైకి వస్తే, అది బీజేపీకి దక్షిణాదిన అడ్డుగోడగా మారుతుంది. అయితే, ఇదే సమయంలో రేవంత్ వ్యాఖ్యలను బీజేపీ తమకు అనుకూలంగా మలుచుకుని "కాంగ్రెస్ దేశాన్ని విభజిస్తోంది" అనే ప్రచారాన్ని నార్త్ ఇండియాలో మొదలు పెట్టే ఛాన్స్ కూడా ఉంది. రేవంత్ రెడ్డి ఎంచుకున్న ఈ 'దక్షిణ సెంటిమెంట్' రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తోంది. ఇది కేవలం సీట్ల పెంపు అంశమే కాదు.. భవిష్యత్తు భారత రాజకీయాల గమనాన్ని మార్చే కీలక పరిణామం. రేవంత్ రెడ్డి ఈ పోరాటంలో దక్షిణాది రాష్ట్రాలను ఏకం చేయగలరా? లేదా జాతీయ రాజకీయాల ఒత్తిడిలో తన స్వరాన్ని తగ్గించుకుంటారా? అనేది కాలమే నిర్ణయించాలి.

## బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పోటీ..

అనంతరం జరిగిన మున్సిపల్, లోకల్ బాడీ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై పైచేయి సాధించలేకపోయింది. దీంతో కాంగ్రెస్‌ను ఎదుర్కోవాలంటే బీజేపీతో కలిసి పోటీ చేస్తే బాగుంటుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇప్పటివరకూ బీఆర్ఎస్ నుంచి అధికారికంగా ఎలాంటి సంకేతాలూ లేవు. మరోవైపు బీజేపీలో కూడా కొంతమంది నేతలు బీఆర్ఎస్‌తో పొత్తుపై కామెంట్స్ చేస్తున్నారు. తాజాగా బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ఈ తరహా కామెంట్స్ చేశారు. రాజకీయాల్లో శాశ్వత మిత్రులు కానీ, శాశ్వత శత్రువులు ఉండరన్నారు. గతంలో టీడీపీతో పొత్తు పెట్టుకుని, విడిపోయి, మళ్ళీ కలిసిన ఉదాహరణలను ఆయన గుర్తు చేస్తున్నారు. "నడవడానికి ఒక కాలు ఇబ్బందిగా ఉన్నప్పుడు మరో కాలు సాయం తీసుకోవడంలో తప్పులేదు" అనే సిద్ధాంతాన్ని ఆయన తెరపైకి తెచ్చారు. బీఆర్ఎస్‌తో కలిస్తే తెలంగాణలో అధికారంలోకి రావడం సులభం అవుతుందనేది ఈ వర్గం ఆలోచన. అయితే బీజేపీలోనే బీఆర్ఎస్‌తో పొత్తును వ్యతిరేకించే వాళ్లు కూడా ఉన్నారు. పాయల్ శంకర్ వంటి నేతలు ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బీఆర్ఎస్‌ను ఒక చచ్చిన శవంతో పోలుస్తూ, ఆ పార్టీ మళ్ళీ కోలుకునే అవకాశం లేదంటున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ మాత్రం బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని చాలాకాలంగా విమర్శిస్తోంది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన దానం నాగేందర్ పైన బీజేపీ ఎమ్మెల్యే పిటిషన్ వేయడం, ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవితకు క్లీన్ చీట్ ఇవ్వడం లాంటి వాటిని కాంగ్రెస్ ఇందుకు ఉదాహరణలుగా చెప్తోంది. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి కూడా వచ్చే ఎన్నికల్లో ఆ రెండూ జట్టుకట్టి వచ్చినా కూడా ఓడిస్తానని ప్రకటించారు. అంతేకాదు.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించేందుకు ఆ రెండూ తప్పకుండా కలుస్తాయని హస్తం నేతలు గట్టిగా భావిస్తున్నారు. మరోవైపు బీజేపీలోని కొంతమంది కీలక నేతలు, బీఆర్ఎస్‌తో పొత్తుకు అనుకూలంగా ఉన్నారని సమాచారం. బీఆర్ఎస్ కోసమే బీజేపీని ఎదగకుండా అడ్డుకుంటున్నారని కమలం పార్టీలోనే కొంతమంది నేతలు అధిష్టానానికి ఫిర్యాదులు సైతం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో బీఆర్ఎస్‌తో పొత్తుకు బీజేపీ ఏ మేరకు ఒప్పుకుంటుందనేది ఆసక్తికరం. కాబట్టి బీజేపీ - బీఆర్ఎస్ కలవచ్చు.. కలవకపోవచ్చు. ఇవన్నీ ఎన్నికల లెక్కలు, సమీకరణాలపై ఆధారపడి ఉంటుంది. అయితే ఇప్పటికిప్పుడు ఎన్నికలు లేవు కాబట్టి ఈ పొత్తుపై ఇప్పుడే అంచనాకు రాలేం. ముమ్మందు ఏం జరుగుతుందో వేచి చూడాలి.

# మహిళా లీడర్లు కావలెను

**తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక భారీ మార్పు రాబోతోంది. నియోజకవర్గాల పునర్విభజనతో పెరగనున్న సీట్లు, మహిళా రిజర్వేషన్ బిల్లు అమలులోకి రానుండటంతో, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాజకీయ యవనికపై మహిళా నేతల హవా మొదలుకానుంది. ఇప్పటి వరకు పురుషాధిక్య రాజకీయాల్లో అవకాశాల కోసం ఎదురుచూసిన ఎంతో మంది చైతన్యవంతులైన మహిళలకు ఇది నిజంగానే గోల్డెన్ టైమ్ అని చెప్పవచ్చు. ప్రతి ముగ్గురు ఎమ్మెల్యేలలో ఒకరు కచ్చితంగా మహిళా నేతే ఉండబోతుండటంతో, ఇరు రాష్ట్రాల్లోని ప్రధాన పార్టీలు ఇప్పటి నుంచే మహిళా కేడర్‌ను సిద్ధం చేసే పనిలో పడ్డాయి.**



2029 అసెంబ్లీ ఎన్నికలు.. నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే జరగడం ఖాయంగా కనిపిస్తోంది. దీంతోపాటు 33 శాతం మహిళా రిజర్వేషన్లు కూడా అమలు కానున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. ముఖ్యంగా అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో ఏ ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసినా పెరగబోయే స్థానాలు, మహిళా రిజర్వేషన్ కింద దక్కబోయే సీట్లపైనే చర్చించుకుంటున్నారు. నియోజకవర్గాల పునర్విభజనతో రాష్ట్రంలో ఇప్పుడున్న 119 అసెంబ్లీ సీట్లు 179కి పెరగనున్నాయి. 33 శాతం విమెన్ రిజర్వేషన్ అమలైతే తెలంగాణలో వారికి ఏకంగా 59 సీట్లు దక్కనున్నాయి. మహిళలకు ఇంత పెద్ద సంఖ్యలో అసెంబ్లీ సీట్లు రిజర్వుకానుండడంతో పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు తమ కుటుంబాల్లోని మహిళలకు రెండో సీటుపై ఇప్పటి నుంచే కన్నేస్తున్నారు.

ఆ దిశగా భార్య, కూతు రు, కోడలుతో రాజకీయ పరిచయ కార్యక్రమం చేయిస్తున్నారు. పండుగలు, పబ్బాలు, ఇతర శుభ కార్యాలను పురస్కరించుకొని ఆయా నియోజకవర్గాల్లో ప్రజలకు శుభాకాంక్షలు చెపుతూ ఫ్లెక్సీలు, హోర్డింగ్లు, కటౌట్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వీటిపై జనాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. ప్రస్తుత అంచనాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ సీట్లు 50 శాతం పెరిగితే అందులో సుమారు 80 స్థానాలు మహిళలకే కేటాయించాల్సి ఉంటుంది. అలాగే తెలంగాణలో 60 స్థానాలు మహిళలకు రిజర్వ్ అవుతాయి. అంటే రెండు రాష్ట్రాల్లో కలిపి సుమారు 140 మందికి పైగా మహిళా ఎమ్మెల్యేలు చట్టసభల్లో అడుగుపెట్టబోతున్నారు. గతంలో కేవలం 10 నుంచి 15 శాతం లోపే ఉన్న మహిళా ప్రాతినిధ్యం, ఇప్పుడు ఏకంగా 33 శాతానికి పెరగడం రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేయనుంది.

గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లు ఉన్నప్పటికీ, చాలా చోట్ల భర్తలు లేదా కుటుంబ సభ్యులు ప్రాక్సీ లుగా పాలన సాగించేవారు. కానీ, అసెంబ్లీ స్థాయికి వచ్చేసరికి పరిస్థితి భిన్నంగా ఉండబోతోంది. ప్రస్తుతం సోషల్ మీడియా వాడకం, పెరిగిన విద్యావంతుల సంఖ్య, మహిళల్లో వచ్చిన రాజకీయ చైతన్యంతో సొంతంగా ఎదిగే నేతలకే ప్రాధాన్యత పెరగనుంది. పార్టీలు కూడా కేవలం డమ్మీ అభ్యర్థులను కాకుండా, ప్రజల్లో పట్టున్న, సొంతంగా గెలవగల సామర్థ్యం ఉన్న మహిళా నేతలకే టికెట్లు ఇచ్చే అవకాశం ఉంది.

ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన పార్టీలైన టీడీపీ, వైఎస్సార్‌సీపీ, జనసేన, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలలో ద్వితీయ శ్రేణి మహిళా నాయకత్వం బలంగా ఉంది. నియోజకవర్గాల్లో పార్టీ కార్యకలాపాలు నిర్వహించడం, ప్రజా సమస్యలపై గళం విప్పడం వంటి పనుల్లో మహిళలు చురుగ్గా పాల్గొంటున్నారు. రాబోయే ఎన్నికల్లో రిజర్వేషన్లు ఖచ్చితం కావడంతో, ఇప్పటి వరకు తెర వెనుక ఉండి పనిచేసిన మహిళా నేతలు ఇప్పుడు నేరుగా ప్రజల ముందుకు వచ్చి తమ నాయకత్వ లక్షణాలను నిరూపించుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఇది రాజకీయాల్లో ఒక రకమైన వడపోత కు దారితీసి, అసలైన సమర్థులైన మహిళా నేతలను బయటకు తీస్తుంది. మహిళా రిజర్వేషన్ల వల్ల కేవలం లింగపరమైన ప్రాతినిధ్యమే కాకుండా, సామాజిక సమీకరణాలు కూడా మారుతాయి.

రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లో మహిళా నేతల ఎంపిక కోసం పార్టీలు కొత్త వ్యూహాలను రచించాల్సి ఉంటుంది. మహిళా ఓటర్లు అత్యధికంగా ఉన్న తెలుగు రాష్ట్రాల్లో, ఒక మహిళా నేత ఎన్నికల బరిలో ఉంటే మహిళా ఓటింగ్ శాతం పెరగడమే కాకుండా, విద్య, ఆరోగ్యం, తాగునీరు వంటి మౌలిక సమస్యలపై చర్చ ఎక్కువగా జరుగుతుంది. ఇది రాజకీయాల్లో క్వాలిటీ ని పెంచుతుందనడంలో సందేహం లేదు.

తెలుగు రాష్ట్రాల్లో మహిళా నేతలకు రాబోయే ఐదేళ్లు అత్యంత కీలకం. అవకాశాల కోసం ఎదురుచూసే దశ నుంచి, అవకాశాలను శాసించే దశకు వారు చేరుకోబోతున్నారు. పార్టీలు కూడా తమ గెలుపు గుర్రాలను వెతుక్కునే క్రమంలో మహిళా అనుబంధ విభాగాలను బలోపేతం చేస్తున్నాయి. చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరగడం వల్ల పాలనలో మానవత్వం, పారదర్శకత పెరుగుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ మార్పు కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, సమాజంలోని అన్ని రంగాల్లో మహిళల సాధికారతకు బాటలు వేయనుంది.

## సీతారాముల కల్యాణం



జయభేరి, భద్రాచలం :

దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో కల్యాణ బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా సాగుతున్నాయి. సీతారాముల కల్యాణానికి ఆధ్యాత్మికత ఉట్టిపడేలా.. భక్తకోటి మురిసేలా ఘనంగా ఏర్పాట్లు చేశారు. రాములోరి కల్యాణఘట్టాన్ని ప్రత్యక్షంగా కన్నులారా వీక్షించి తరించేందుకు భక్తకోటి పెద్దఎత్తున తరలివస్తుంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా ఈ వేడుకలో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. స్వామి వారిని దర్శించుకుని ఆశీర్వచనం తీసుకున్నారు. మిథిలా స్టేడియంలో జరిగిన ఈ తిరుకల్యాణ మహోత్సవంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, వాకిటి శ్రీహరి ఇతర ప్రజా ప్రతినిధులు, డీజీపీ బి.శివధర్ రెడ్డి, ఉన్నతాధికారులతో పాటు అశేషంగా భక్తులు పాల్గొన్నారు. సీతారాములకు కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు మిథిలా మైదానం సిద్ధమైంది. అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

సీతారాముల కల్యాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. ఈ వేడుకకు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతున్నారు. నవమి ఉత్సవాల్లో భాగంగా ఆలయ పండితులు ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాల్లో ఎదుర్కోలు అత్యంత కీలకమైన ఘట్టం. పెళ్లికి ముందు సీతారాములను ఎదురెదురుగా ఉంచి, ఇరు పక్షాల వారు పసుపు, కుంకుమలు, తాంబూలాలు మార్చుకుంటూ, భక్తిశ్రద్ధలతో భజనలు చేస్తారు. కల్యాణ వేదికైన మిథిలా ప్రాంగణాన్ని సీతమ్మ పుట్టినిల్లయిన మిథిలా నగరంగా.. పక్కనున్న వైకుంఠ క్షేత్రం రామయ్య వెలసిన ప్రాంతంగా భావిస్తారు. అలాగే.. అర్చకులు భగవంతుని వంశ క్రమాన్ని, గోత్ర నామాలను చదువుతూ పెళ్లికి ముందు వధూవరుల పక్షాన వాదోపవాదాలు చేసుకునే ఈ ఎదుర్కోలు ఘట్టం అత్యంత ఆసక్తికరంగా సాగింది.

ఇదిలావుంటే, శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో పర్యటించనున్న సీఎం రేవంత్‌రెడ్డి ఉదయం 11గంటలకు రామాలయ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. రూ. 351కోట్లతో మొదటి విడత పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే రామాలయ అభివృద్ధికి రూ.586కోట్లతో బృహత్తర ప్రణాళిక రూపొందించింది రాష్ట్ర ప్రభుత్వం. మొదటి దశ పనులను రూ.351కోట్లతో చేపట్టేందుకు పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేసింది. ఈపనులను 2027 నాటికి పూర్తిచేయాలని నిర్ణయించారు. భద్రాచలంలో మౌలిక వసతులు, పుష్కర ఘాట్లు, ఆలయ ప్రాకారాల విస్తరణ, ఆలయ ప్రాంగణం సమీప పరిసరాల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. గోదావరి ఘాట్లను విస్తరించనున్నారు. రెండో విడతలో.. రూ.108కోట్లతో రామాలయ పరిసర ప్రాంతాల్లో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపడతారు. మౌలిక సదుపాయాల కల్పన, రూ. 96 కోట్లతో ఆలయ పరిసరాల అభివృద్ధి, రూ. 75 కోట్లతో గోదావరి ఘాట్ అభివృద్ధి వంటి పనులు చేపట్టనున్నారు. వీటిని 2027లో ప్రారంభించి 2028 నాటికి పూర్తి చేస్తారు. మూడో విడతలో.. భద్రాచలం పట్టణాభివృద్ధికి కావాల్సిన పనులను ఇందులో చేపడతారు. వీటికి రూ.127కోట్లు కేటాయించారు. పనులను 2028లో ప్రారంభించి 2029 నాటికి పూర్తి చేస్తారు.



## ఏపీలో నియోజకవర్గాల పునర్విభజన

6.పెడన (గూడూరు,పెడన, మచిలీపట్నంరూరల్)
7. బంటుమిల్లి. (గుడ్లవల్లేరు, బంటుమిల్లి, కృత్తివెన్ను)

**విజయవాడ పార్లమెంట్:**

1.విజయవాడ ఈస్ట్,
2.వెస్ట్,
3.సెంట్రల్,
4.నార్త్,
5.పెనమలూరు,(పెనమలూరు,విజయవాడ అర్బన్)
6.గన్నవరం,(గన్నవరం,బాపులపాడు,ఉంగుటూరు)
7.ఉయ్యూరు.(ఉయ్యురు,తొట్లవల్లూరు,కంకిపాడు)

**నందిగామ పార్లమెంట్ :**

1.కొండపల్లి,(ఇబ్రహీంపట్నం, కొండపల్లి,సిటీ రూరల్)
2.మైలవరం,(మైలవరం,జి.కొండూరు,వీరులపాడు)
3.తిరువూరు,(గంపలగూడెం,తిరువూరు,
4.నందిగామ,(కంచికచర్ల,నందిగామ)
5.జగ్గయ్యపేట, (సిటీ)
6.విస్సన్నపేట,(రెడ్డి గూడెం, ఏ.కొండూరు, విస్సన్నపేట)
7.పెనుగంచిప్రోలు.(వత్సవాయ్, పెనుగంచిప్రోలు,చందర్లపాడు)

**263 స్థానాలకు పెరగనున్న ఏపీ అసెంబ్లీ**

రాష్ట్ర విభజన సమయంలోనే నియోజకవర్గాల పునర్విభజన అంశం చర్చకు వచ్చినప్పటికీ... ఇప్పటివరకు అమలుకాలేదు. తాజా పరిణామాలతో ఈ అంశం మళ్లీ రాజకీయంగా హాట్‌టాపిక్‌గా మారింది. తెలుగు రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజన ప్రస్తావన వచ్చింది కానీ ఇప్పటి వరకు దాని ప్రస్తావన రాలేదు. అయితే త్వరలోనే ఈ అంశానికి సంబంధించి బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉందని...2029 నాటికి కొత్త నియోజకవర్గాలు ఏర్పడే అవకాశం ఉందని తెలుస్తోంది. పునర్విభజన చట్టంలోని హామీల మేరకు అసెంబ్లీ స్థానాల పెంపు జరిగే అవకాశం ఉంది అని తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 175 శాసనసభ నియోజకవర్గాలు ఉండగా... నియోజకవర్గ పునర్విభజన జరిగితే కొత్తగా 50 శాతం స్థానాలు పెరిగే అవకాశం ఉంది. అంటే 88 అసెంబ్లీ స్థానాలు పెరగనున్నాయి. వీటితో కలుపుకుంటే ఏపీలో మొత్తం అసెంబ్లీ స్థానాల సంఖ్య 263కు చేరుకోనుంది. వీటిలో 87 అసెంబ్లీ స్థానాలు మహిళలకు రిజర్వ్‌డ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

**38కి పెరగనున్న లోక్‌సభ స్థానాలు**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం 25 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. అయితే ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. 2029కల్లా ఏపీలో నియోజకవర్గాల పునర్విభజన జరగనుంది. ఈ క్రమంలో ఏపీలో కొత్తగా 13 లోక్‌సభ స్థానాలు ఏర్పడే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో ఏపీలోక్ సభ స్థానాల సంఖ్య 25 నుంచి 38కి పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

**కొత్త స్థానాలతోనే 2029 ఎన్నికలు**

అయితే నియోజకవర్గాల సంఖ్య పెంపు కంటే ముందే మహిళా రిజర్వేషన్ చట్టం, డీలిమిటేషన్ చట్టాలకు సవరణలు ప్రతిపాదిస్తూ ఈ పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు తీసుకురాబోతున్నట్లు తెలుస్తోంది. లోక్‌సభలో ఇందుకు సంబంధించిన బిల్లు ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుచేసి చకచకా సీట్ల పెంపు కార్యక్రమం పూర్తిచేసి 2029 ఎన్నికల్లో అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. సీట్ల పెంపు దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కూడా పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

# ఘనంగా అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

- హాజరు అయ్యిన అతిరధ మహారధులు

**జయభేరి, పరవాడ:**




పరవాడ గ్రామంలో అభయ ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధల మధ్య నిర్వహించ బడింది. శుభ ముహూర్తంలో యాగాలు, హోమాలు నిర్వహించి, అనంతరం స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించగా, గ్రామం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంలో నెలకొంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి,మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్ , వైస్సార్సీపీ చోడవరం నియోజకవర్గ పరిశీలకుడు గండి రవి కుమార్ స్వామివారి దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి గ్రామానికి విచ్చేసిన అతిధులకు వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల నియోజకవర్గ పరిశీలకులు పైల శ్రీనివాసరావు, పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు,మాజీ సర్పంచ్ చుక్క రాము నాయుడు పుష్ప గుచ్ఛం అందచేసి ఆత్మీయంగా ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడమే కాకుండా యువతలో సాంప్రదాయ విలువలను బలపరుస్తాయని పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. అలాగే శ్రీరామనవమి సందర్భంగా ప్రతిష్ట అనంతరం రామాలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించగా, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో పరవాడ జడ్పీటీసీ పి.ఎస్ రాజు గారు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బైలపూడి భగవాన్ జై రాం, పరవాడ మండల పార్టీ అధ్యక్షులు కోన రామారావు, పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు, సర్పంచ్ లు గొర్లి గోపి, పెదిశెట్టి శేఖర్, బండారు రాజ్ శేఖర్, పరవాడ వార్డ్ మెంబెర్ లు గండి ఈశ్వరరావు, పోతాల అప్పల నాయుడు, వగ్రీ లక్ష్మీ, పైల హరీష్, శిరపురపు రాజేష్,పైల అప్పలనాయుడు మండల ప్రధాన కార్యదర్శి పైల రాధ కృష్ణ, పైల పైడం నాయుడు, వగ్రీ హరి, బంగారం, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, మహిళలు , తదితరులు పాల్గొన్నారు.




## కనుల పండగగా శ్రీ సీతారాములవారి కల్యాణం

**జయభేరి, పరవాడ:**

పరవాడ గ్రామంలో రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతా రాముల వారి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు రాములు వారి దర్శనానికి,కళ్యాణానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 6 గంటల నుండి శ్రీ సీతారాముల వారి ఆలయంలో పూజా కార్యక్రమాలు, కళ్యాణం కనుల విందుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రసాద వితరణ, పానక వితరణ చేసారు. ఆలయాన్ని అందంగా అలకరిస్తూ ఉదయం నుండి భక్తులు వందల సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు తరువాత గ్రామంలో దాతల సహాయంతో ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమంని పరవాడ గ్రామ పెద్దలు సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, ఎంపీటీసీ పయిల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్లు చుక్క రామునాయుడు, పయిల అప్పారావు చేతులు మీదగా ఆలయ కమిటీ సభ్యులు మొదలు పెట్టారు. తదనంతరం శ్రీ సీత రాముల అనుపు విగ్రహలను గ్రామంలో బాణాసంచా కాల్పులతో ఊరేగింపుగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో పయిల పోతునా యుడు, రెడ్డి శ్రీనివాసరావు,పయిల రామచంద్రావు, పోతల అప్పలనాయుడు, పయిల హరీష్ అధిక సంఖ్యలో భక్తులు ప్రజలు పాల్గొన్నారు.


## శ్రీరామనవమికి నారాయణ సేన ఆధ్వర్యంలో ప్రసాద వితరణ




**జయభేరి, పరవాడ:**

లంకెలపాలెం జంక్షన్ లో శుక్రవారం శ్రీ నవమి సందర్భంగా మరిడిమాంబ చిల్లర వర్తక సంఘం మరియు నారాయణ సేన ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ, పానకం,ప్రసాద్ వితరణ పంపిణీ చేసారు.ఈ యొక్క కార్యక్రమంలో నారాయణ సేన ప్రతినిధులు మరియు వర్తక సంఘం అధ్యక్షులు కూట్ని శ్రీని వాసరావు, బోండా నారాయణరావు, నానాజీ,చిట్టిబోయిన అప్పారావు , శేఖర్ రెడ్డి. మంత్రి గిరి ప్రసాద్, బొక్క నాని, మరిడిమాంబ వర్తక సంఘం పెద్దలు మహిళలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## వెన్నెల పాలెంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు



**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం వెన్నెల పాలెం గ్రామంలో స్థానిక రామాలయం వద్ద శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రామాలయంలో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని పురోహితుని వేదమంత్రోచ్చరణలతో వేడుకగా జరిపించారు. శ్రీరామనవమి వేడుకలలో విశిష్ట అతిథులుగా తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాధవీ లత దంపతులు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి, యువనేత బండారు అప్పలనాయుడు డా. నందిని వేదశ్రీ దంపతులు,వినయ్ కుమార్ స్రవంతి దంపతులు సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొని వారి చేతుల మీదగా కళ్యాణ మహోత్సవం జరిపించి సీతారాముల దివ్య ఆశీస్సులను పొందారు.అధిక సంఖ్యలో ప్రజలు భక్తులు సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని కనులారా వీక్షించి సీతారాములవారిని దర్శించుకున్నారు. శ్రీరామనవమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే బండారు మాధవి లత, గ్రామ పెద్దలు మరియు డ్వాక్రా మహిళల సహకారంతో భారీ అన్న సమారాధనను ఏర్పాటు చేశారు.అధిక సంఖ్యలో ప్రజలు అన్న సమారాధనలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,పెద్దలు, యువకులు,భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న ప్రజా ప్రభుత్వం

- ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి మండలం మొద్గుల మల్లేపల్లి గ్రామంలో శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ పోటీలను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించడం ఎంతో అవసరమని, క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి టోర్నమెంట్ ల ద్వారా గ్రామీణ యువతకు తమ ప్రతిభను ప్రదర్శించే మంచి వేదిక లభిస్తుందని, ప్రభుత్వం కూడా క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. శ్రీరామ నవమి పర్వదినం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, శ్రీరాముని ఆదర్శాలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ లో పాల్గొంటున్న జట్లకు శుభాకాంక్షలు తెలియజేసి, క్రీడాస్ఫూర్తితో పోటీలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లేష్, మాజీ ఎంపీపీ భవాని పవన్ కుమార్, మండల అధ్యక్షులు నాగభూషణం, ముచర్ల గిరి, వెంకటయ్య గౌడ్, రవిశంకర్ రెడ్డి, హరినాయక్, జంగిటి నర్సింహా, మల్లేష్ యాదవ్, నగేష్, మండల నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన సర్పంచ్ యుగేందర్ రెడ్డి



**జయభేరి, కొండ మల్లేపల్లి :**

కొండమల్లేపల్లి మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులను పరిశీలించిన సర్పంచ్ యుగేందర్ రెడ్డి సర్పంచ్ మాట్లాడుతూ.. కొండమల్లేపల్లి అని తెలంగాణలోనే అతి పెద్ద గ్రామపంచాయతీ అయిన కొండమల్లేపల్లి ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని 8,9,10 వార్డులలో పెద్ద సమస్య గా ఉన్న డ్రైనేజీ సమస్యకు పరిష్కారం గత మూడు రోజుల నుండి 8,9,10 వార్డులలో సమస్యలన్నీ దగ్గరుండి పనులను పరిశీలించినారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బిజిలి లింగం, గంట మల్లేష్, శీను MRPS మండల పార్టీ అధ్యక్షులు వెంకటేష్ అంజి తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ పర్యటన

**జయభేరి, రాజన్న సిరిసిల్ల :**

బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం నాడు ఎల్లారెడ్డిపేట మండలం లో పర్యటించారు. రాచర్ల గొల్లపల్లిలోని హనుమాన్ ఆలయం మూడు గుళ్లులో శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


# ఫ్లైయాష్ బొగ్గు వాహనాల ఓవర్‌లోడింగ్‌పై కఠిన చర్యలు తప్పవు

- పరవాడ డి.ఎస్.పి. బి. మోహన్‌రావు

**జయభేరి, పరవాడ:**



పరవాడ ఇన్‌చార్జి డి.ఎస్.పి. బి. మోహన్‌రావు ఆధ్వర్యంలో పరవాడ డి.ఎస్.పి. కార్యాలయంలో రవాణా సంబంధిత అంశాలపై సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి సి.ఐ. పరవాడ ఆర్. మల్లికార్జునరావు హాజరయ్యారు. ఈ సమావేశంలో డి.ఎస్.పి. మాట్లాడుతూ.. ఓవర్‌లోడింగ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేసి, అన్ని వాహనాలు నిర్దేశిత పరిమితిలోనే లోడ్‌తో నడవాలని ఆదేశించారు. ఎన్‌టిపిసి, హిందూజా, శరత్ చటర్జీ (బోత్రా) సంస్థలు తమ లోడింగ్ పాయింట్లలో తప్పనిసరిగా వేబ్రిడ్జి (కాటా) ఏర్పాటు చేసి, పరిమితికి లోబడే విధంగా మాత్రమే లోడ్ చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి జిల్లా రవాణా శాఖాధికారి కార్యాలయం నుంచి పొందిన వాహనాల లోడ్ పరిమితి వివరాలను వారికి పంపించి, ఆ ప్రకారమే లోడ్ చేయాలని తెలిపారు. రోడ్డుపై ఫ్లై యాష్, కోల్ లీకేజీ జరగకుండా టార్పాలిన్ కవర్లు బిగుతుగా కట్టాలని, ఫ్లై యాష్ పూర్తిగా ఆరిన తర్వాత మాత్రమే రవాణా చేయాలని సూచించారు. లోపాలు ఉన్న పాత వాహనాలను వినియోగించరాదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు.ఈ సమావేశంలో హిందూజా నుంచి పి.ఎం. నాయుడు (సి.ఎస్.ఓ.), శరత్ చటర్జీ (బోత్రా) నుంచి ఎస్.ఆర్. బండారి, ఎల్.ఎస్. నాయుడు, ఎన్‌టిపిసి నుంచి కె. ప్రకాష్ రావు (అసోసియేట్ హెచ్.ఆర్.), రాజా హల్దార్ (డీజీఎం, యాష్‌డైక్), అలాగే బొగ్గు, ఫ్లై యాష్ రవాణాదారులైన కేసరపు శ్రీను, జి. ప్రసాద్ (సత్యదీపక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్), ఆర్. భాను ప్రసాద్ (కార్తికేయ ఎంటర్‌ప్రైజెస్), జి. వెంకట రమేష్ (అశ్విని ప్రాజెక్ట్స్) ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# కమనీయం సీతారాముల కల్యాణం

**జయభేరి, యాదగిరిగుట్ట :**



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నర సింహ స్వామి వారి ఆలయంలో కొలువైన శ్రీపర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో కల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయంలో శ్రీరామ వసంత నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. సీతారాములను ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం ఆలయ పుర వీధుల్లో ఊరేగించి కల్యాణ మండపం దగ్గర అధిష్టింపజేశారు. అనంతరం గణపతి పూజతో పాటు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు కల్యాణ తంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని భారీగా తరలివచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని తరించగా,భక్తులకు ఆలయ అర్చకులు సీతారాముల కల్యాణ విశిష్టతను తెలియజేశారు.

శ్రీరామ వసంత నవరాత్రోత్సవాలలో భాగంగా ఉదయం శ్రీ సీతారామ చంద్ర స్వామి పట్టాభిషేకం, శనివారం రాత్రి డోలోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త నర్సింహ మూర్తి, యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ తో పాటు ఆలయ అధికారులు, సిబ్బంది,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

**జయభేరి, యాదగిరిగుట్ట :**



యాదగిరిగుట్ట పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం శ్రీరామ నవమి పురస్కరించుకొని గ్రామాల్లో శ్రీసీతారాముల కల్యాణమహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. యాదగిరిగుట్ట పట్టణంలోని హనుమాన్ గుడి, బీసీ కాలనీ, బీసీ హాస్టల్ దగ్గర హనుమాన్ గుడి, గణేష్‌నగర్, శ్రీరాంనగర్‌తో పాటు సైదాపురం, మాసాయిపేట గౌరాయపల్లి, పెద్దకందుకూర్, రామాజీపేట,బాహుపేట, వంగపల్లి, మైలార్‌గూడెం తదితర గ్రామాలలో శ్రీసీతారామ చంద్రస్వామి కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాల సందర్భంగా ఊరూవాడా శ్రీరామ నామం, జై హనుమాన్ నామస్మరణతో మారుమ్రోగింది. శ్రీరామనవమి వేడుకల్లో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలేరు నియోజకవర్గంతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని సీతారాములను వేడుకున్నట్లు బీర్ల అయిలయ్య తెలిపారు. యాదగిరిగుట్ట పట్టణంలోని జరిగిన వేడుకల్లో యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు బబ్బూరి శ్రీధర్, బూడిద మధు,పెలిమెల్లి లావణ్యశ్రీధర్‌గౌడ్, బిట్టు సరోజా హరీష్,కర్రె మాధవి ప్రవీణ్, బోడ రాధ సురేష్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు,వివిధ పార్టీల నేతలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని కల్యాణ మండపాలతో పాటు పలుచోట్ల అన్నదానం కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



## ఆత్మీయ మిత్రునికి వీడికోలు సన్మానం

**జయభేరి, దేవరకొండ :**

పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు దేవరకొండ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ కుంభం శేఖర్ పదోన్నతిపై మేనేజరుగా వనపర్తి బ్యాంకుకు వెళుతున్న సందర్భంగా అంకం చంద్రమౌళి రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం దేవరకొండ ప్రధాన కార్యదర్శి వారిని షాలువతో సన్మానించి సూక్తుల గ్రంథం అందజేసినారు. వారు మాట్లాడుతూ ముందు ఇంకా పదోన్నతి పొందాలని కోరినారు. బ్యాంకులో మీ సేవలు మరువలేము అన్నారు. తరువాత బ్యాంకు మేనేజర్ వారి సిబ్బంది షాలువత సత్కరించి గిఫ్ట్ అందజేసినారు. మేనేజర్ పార్తునాయక్ మాట్లాడుతూ శేఖర్ చాలా ఓపికస్తుడు, సమస్యను పరిస్కారం చేయడంలో సిద్దహాస్తుడు, ప్రమోషన్ వెళ్లుచున్ననందున మాకు చాలా సంతోషంగా ఉంది అన్నారు. శేఖర్ మాట్లాడుతూ ఈ బ్రాంచి నుండి వెలుచున్నందున విచారముగా వుంది, ఇక్కడి ఖాతా దారులు, మాసిబ్బంది నాకు మంచి కోఆపరేషన్ ఇచ్చినారు. అందరికి కృతజ్ఞతలు తెలియజేసినారు.

## శ్రీరాముని ఆదర్శాలు సమాజానికి మార్గదర్శకం

- ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి




**జయభేరి, షాద్ నగర్, మార్చి 27 :**

శ్రీరామనవమి సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలో హిందూవాహిని ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన శ్రీరామ శోభాయాత్రలో ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవీన్ రెడ్డి మాట్లాడుతూ... శ్రీరాముడు ధర్మం, నిజాయితీ, ఆదర్శవంతమైన వ్యక్తిత్వానికి ప్రతిరూపమని పేర్కొన్నారు. శ్రీరాముని ఆదర్శాలను, ధర్మాన్ని సమాజానికి చాటిచెప్పడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఆయన చూపిన మార్గాన్ని అనుసరిస్తూ సమాజంలో మంచి మార్పులు తీసుకురావాలని, ముఖ్యంగా యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు యన్. అనిత రఘునాథ్ యాదవ్, పిల్లి శారద శేఖర్, ఎస్పీ శివ, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ నందకిషోర్, నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్ ,శేరి శ్రీనివాస్ రెడ్డి, దినేష్ సాగర్ తదితరులు పాల్గొన్నారు. హిందూవాహిని సభ్యులు, యువకులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


## అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ బి ఎస్ ఆర్ కాలనీ ఆంజనేయ స్వామి దేవాలయంలో అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవం 1974 సంవత్సరం నుండి స్వయంభు ఆంజనేయ స్వామి దేవాలయంలో చౌ ల్లేటి వెంకటాచారి స్వయంభు ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్టించినారు అప్పటినుండి ఇప్పటివరకు ప్రతి సంవత్సరం సీతారాముల కల్యాణ మహోత్సవం 52 సంవత్సరం ల నుండి భక్తి శ్రద్ధలతో సీతారాముల కల్యాణ మహోత్సవం ప్రతి సంవత్సరం జరుపుతున్నారు 1974 నుండి 2011 సంవత్సరం వరకు దాసోజు భద్రయ్య నిర్వహించినారు తధానంతరం వారి కుమారుడు దాసోజు అనిల్ కుమార్ సొంత ఖర్చులతో సీతారాముల కళ్యాణం మహోత్సవం ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నారు. దాసోజు అనిల్ కుమార్ మాట్లాడుతూ సీతారాముల కళ్యాణం మహోత్సవం నా చేతుల మీదుగా కళ్యాణ మహోత్సవం జరగడం నా అదృష్టంగా భావిస్తున్నాను అని తెలియజేసినారు కాలనీవాసులు అనిల్ కుటుంబం సీతారాముల కల్యాణ మహోత్సవం ప్రతి సంవత్సరం జరపడం మా కాలనీ వాసులకు చాలా ఆనందంగా ఉన్నది అని తెలియజేసినారు.

## శ్రీరామచంద్రుడి కృపా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలి



**జయభేరి, చింతపల్లి :**

శ్రీరామచంద్రుడి కృపా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు.చింతపల్లి మండలం తీదేడు గ్రామం రామాలయంలో శ్రీరామనవమి పురస్కరించుకుని సీతా రాములవారి కళ్యాణోత్సవం కన్నుల పండుగగా సాగింది.వేద పండితుల మంత్రోచరణలు, వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా అంగ రంగ వైభవంగా సీతారాముల కళ్యాణం జరిగిందని సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక కళ్యాణం కోసం ఎన్నోత్యాగాలను కోర్చిన సీతారాముల పవిత్ర బంధం అజరామరమైనదని, రాబోయే తరాలకు ఆదర్శనీయమైనదని ఆమె తెలిపారు.సీతారాముల ఆశీస్సులు అందరిపై ఉండాలని,ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవనం సాగించేలా దీవించాలని సీతారామచంద్రమూర్తులను ప్రార్థించనున్నట్టు ఆమె తెలిపారు. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి అని ఆమె అన్నారు.దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు.ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి అని ఆమె అన్నారు.

# ఘనంగా సీతారాముల కల్యాణ మహోత్సవం

- భారీ సంఖ్యలో పాల్గొన్న గ్రామస్తులు
- కన్నుల పండుగగా సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమం

**జయభేరి, షాద్ నగర్, మార్చి 27 :**



నాగులపల్లి గ్రామంలో ఘనంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమంను గ్రామ పెద్దలు, సర్పంచ్,ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ లు, మాజీ ఉప సర్పంచ్ లు, మాజీ వార్డు సభ్యులు, మహిళలు, యువకులు, అందరి సమక్షంలో ఘనంగా నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం నాగులపల్లి గ్రామంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సీతారాముల కళ్యాణంకు భారీ సంఖ్యలో గ్రామస్తులందరూ పాల్గొని కార్యక్రమాలను ఘనవిజయం చేశారు. సీతారాముల కల్యాణానికి వచ్చిన భక్తులకు మంచినీరు, భోజనం వంటి సౌకర్యాలను గ్రామ పెద్దలు ఏర్పాటు చేశారు.
ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ....



మా గ్రామంలో ప్రతి సంవత్సరం సీతారాముల కళ్యాణం మహస కార్యక్రమం ఏర్పాటు చేయడం ఎంతో ఆనందకరంగా ఉందని అన్నారు. కన్నుల పండుగగా గ్రామస్తులందరూ ఏకమై తరలి వచ్చి భగవంతునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయంత్రం ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆటపాటలతో అంగరంగ వైభవంగా సీతారాములకు పూల వర్షం కురిపించి వాడ వాడ ఊరేగింపు నిర్వహించారు. భగవంతుని కృప గ్రామ ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని తమ గ్రామం వచ్చే ఏడాది వరకు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని భగవంతుని ప్రార్థించారు.
ఊరేగింపులో ఎంతో ఉత్సాహంతో పూల వర్షం కురిపించారు. గ్రామంలో ప్రతి కుటుంబంలో వారు కోరుకున్న కోరికలు పాడిపంటలు, ఉద్యోగం, వ్యాపారం వంటి అన్ని రంగాలలో తమ గ్రామస్తులు రాణించాలని భగవంతుని వేడుకున్నారు. ఒకే వేదికపై అన్ని రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్తులు ఎంతో సంతోషంగా వేదిక పంచుకున్నారు. కన్నుల పండుగ కార్యక్రమాల విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, గ్రామ పెద్దలు, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ లు, మాజీ ఉప సర్పంచ్ లు, మాజీ వార్డు సభ్యులు,మహిళలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు,యువకులు, గ్రామంలోని ప్రతి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరాముని ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

- రాసుమల్ల గూడా గ్రామ పెద్దలు,సర్పంచ్ నత్తి శివరాములు

**జయభేరి, షాద్ నగర్, మార్చి 27 :**



శ్రీరాముని ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని రాసుమల్ల గూడ సర్పంచ్ నత్తి శివరాములు అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా షాద్ నగర్ నియోజకవర్గంము ఫరూక్ నగర్ మండలం రాసుమల్ల గూడా గ్రామంలో ఘనంగా నిర్వహించిన శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవ కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్, మాజీ ఉప సర్పంచ్,మాజీ వార్డు సభ్యులు,మహిళలు,యువకులు ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శివరాములు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకుని నడవాలని, నేటి పాలకులు కూడా ప్రజలకు శ్రీరాముని వంటి పరిపాలన అందించాలని సూచించారు. అలాగే ప్రతి కుటుంబంలో దంపతులు సీతారాములను ఆదర్శంగా తీసుకుని సుఖసంతోషాలతో జీవించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

- సీతారామ ఆలయంలో కన్నుల పండుగగా కళ్యాణ మహోత్సవం

**జయభేరి, శామీర్ పేట్, మర్చి 27:**



శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మేడ్చల్ జిల్లా దేవరయంజాల్ లోని శ్రీ సీతారామస్వామి ఆలయంలో ఘనంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. వేదపండితుల మంత్రోచారణల మధ్య నిర్వహించిన ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్, , టీ పీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కందాడి అంజిరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు నక్క సందీప్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఈ కళ్యాణ మహోత్సవాన్ని తిలకించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు. ఇక కళ్యాణం అనంతరం ఆలయ సిబ్బంది అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్లు , మాజీ ధర్మకర్తలు, మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపిటీసీలు, , మాజీ కౌన్సిలర్లు, మాజీ వార్డు సభ్యులు, పలు పార్టీల నేతలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం




**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 27 :**

తుర్కపల్లి మండల కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీరామనవమి పురస్కరించుకొని శుక్రవారం శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం గ్రామ పురోహితుడు రమాకాంత్ శర్మ, దేవాలయ పురోహితుడు మనీష్ పాండేల ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ఎదుర్కోలు కార్యక్రమాన్ని నిర్వహించి, కళ్యాణ తంతును కన్నుల పండుగగా, కమనీయంగా నిర్వహించారు.
అనంతరం భక్తులు అమ్మవారికి ఓడిబియ్యాన్ని సమర్పించి మొక్కలను తీర్చుకున్నారు. తుర్కపల్లి ప్రాంతమంతా హరే రామ నామ జపంతో మారుమోగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో సర్పంచ్ సోమల వెంకటేశం, దేవాలయ కమిటీ చైర్మన్ పడాల శ్రీనివాస్, కందుకూరి చలమయ్య, పడాల చంద్రం, కళాసికం అమరేందర్ ఆకుల దేవయ్య, రంగ శంకరయ్య, పడాల శ్రీకాంత్, పెండెం రవి, పడాల లక్ష్మీకాంత్, పెండెం శ్రీనివాస్, పెండెం ప్రవీణ్, కందుకూరి బాలరాజు, సోముల మల్లేశం, కోలా గురునాథ్, బోయిని నాగరాజు, కళాశికం జగదీష్ , ఆగ చారి,కందుకూరి లక్ష్మణ్, ఇమ్మడి సంతోష్, పాముల జంగయ్య, కందుకూరి అమర్నాథ్, కట్కూరి వెంకటేష్, కొక్కొండ లక్ష్మీనారాయణ, ఆకుల సైదులు, ఆకుల వెంకటేష్, బోయిని అరవింద్, దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## 17 మంది భూ నిర్వాసితులకు నష్ట పరిహారము చెల్లింపు

**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి మండలములోని చర్లగూడెం రిజర్వాయర్ (R&R) వర్కాల గ్రామము యొక్క భూ నిర్వాసితులకు చింతపల్లి మండలము నందు 17 మంది భూ నిర్వాసితులకు నష్ట పరిహారము చెల్లించడము జరిగినది, ఇట్టి పంపిణి కార్యక్రమములో MLA నేనావత్ బాలు నాయక్, రాజస్వ మండలాధి దేవరకొండ, తహసీల్దార్ చింతపల్లి, సంబంధిత గ్రామ సర్పంచ్ లు, ప్రజా ప్రతినిధులు కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి మోటర్ ను ప్రారంభించిన మైనంపల్లి సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామం HRD కాలేజ్ గేట్ వద్ద ఉన్న ప్రజలకు సౌకర్యార్థం కోసం మంచినీటి నూతన మోటర్ ను ఎమ్మెల్యే బాలునాయక్ సూచన మేరకు స్థానిక మైనంపల్లి సర్పంచ్ దేవరకొండ సర్పంచుల ఫోరం అధ్యక్షులు కొర్ర రాంసింగ్ నాయక్ పాలక వర్గ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకోవాలి అని అన్నారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ లాలు నాయక్ ,వార్డు సభ్యులు కొర్ర కిషన్ నాయక్, కొర్ర బద్దు సునీత,కొర్ర లక్ష్మీ ప్రశాంత్,పులిజాల సంతోష వెంకట్ ,పులిజల నాగరాజు, వడిత్య స్నేహ వినోద్, లైన్ మెన్ శివ గ్రామస్థులు తదితరు పాల్గొన్నారు.

## శ్రీరామనవమి శోభాయాత్ర

- గవర్నర్ శివప్రతాప్ శుక్లా

**జయభేరి, హైదరాబాద్ ;**

నగరంలో శ్రీరామనవమి శోభాయాత్రను రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రారంభించారు. సీతారాంబాగ్ ఆలయం నుంచి కోఠిలోని హనుమాన్ వ్యాయామశాల వరకు ఈ శోభాయాత్ర కొనసాగుతుంది. శోభాయాత్రను ప్రారంభించిన అనంతరం గవర్నర్ మాట్లాడుతూ, ఏళ్ల తరబడి నగరంలో శ్రీరామ శోభాయాత్ర ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. భారతీయ సంస్కృతిలో రామాయణానికి చాలా విశిష్ఠత ఉందని అన్నారు. ఆదర్శ కుమారుడు, ఆదర్శ భర్త, ఆదర్శ పురుషుడుగా శ్రీరాముడిని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఐకమత్యం, భక్తిభావనకు శోభాయాత్ర నిదర్శనంగా నిలుస్తోందని గవర్నర్ అన్నారు.

# మన్యంకొండలో స్వామి కళ్యాణం.. కమనీయం..

- మన్యం కొండలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- సాంప్రదాయ రీతిలో స్వామివారి కల్యాణ మహోత్సవం
- అలంకరణలో భక్తకోటికి స్వామి దంపతుల దర్శనం





**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన దేవాలయమైన మన్యం కొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రీరామనవమి పర్వదిన వేడుకల సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏడాది శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా, సాంప్రదాయ రీతిలో భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా పర్వదిన వేడుకలు సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. దీంతో వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చిన భక్తులు స్వామివారి కల్యాణ ఘట్టాని కనులారా తిలకించి.. మనసారా తన్మయం చెందారు. ఈ సందర్భంగా ముందుగా సాంప్రదాయ రీతిలో వివిధ కల్యాణ పూజా కార్యక్రమాలను దేవస్థానం చైర్మన్, వంశపార్యం పర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్ ఆధ్వర్యంలో పలు కల్యాణ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అశేష భక్త జనావళి తిలకిస్తుండగా పురోహితులు వేదమంత్రాలు, భక్తుల హరినామస్మరణ, సన్నాయి వాయిద్యాల మధ్య అమ్మవారి మంగళసూత్రధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళ్యాణ మహోత్సవం అనంతరం స్వామి దంపతులను పల్లకిలో గర్భగుడిలోకి తీసుకెళ్లి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి దంపతులను వివిధ రకాల బంగారు ఆభరణాలు, రంగురంగుల పూలతో ముస్తాబు చేశారు. దీంతో అలంకరణలో స్వామి దంపతులు భక్తకోటికి దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, వంశపార్యం పర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ, ఈవో శ్రీనివాస రాజు, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య, పర్యవేక్షకుడు నిత్యానంద చారితోపాటు పాలకమండలి సభ్యులు, దేవస్థానం పురోహితులు, సిబ్బంది, వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## కల్యాణోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఆర్టిఐ కమిషనర్

**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 27 :**

తుర్కపల్లి మండల కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారాముల కల్యాణోత్సవంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, రాష్ట్ర ఆర్టిఐ కమిషనర్ బోర్డెడ్డి అయోధ్య రెడ్డి లు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సోమల వెంకటేశం, దేవాలయ కమిటీ చైర్మన్ పడాల శ్రీనివాస్, పెండెం శ్రీనివాస్, ఎలగల రాజయ్య, ఆకుల దేవయ్య, ఆగ వాలి, కట్కూరి వెంకటేష్, కందుకూరి బాలరాజు, బొల్లారం జగదీష్, కందుకూరి లక్ష్మణ్, ఆకుల వెంకటేష్, పాముల రాజు గౌడ్, గుండెబోయిన బలరాం, అరిగే మైపాల్, ఆకుల సైదులు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఇన్నో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇన్నో యాత్ర




**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 27 :**

ఇన్నో యాత్ర 2026 సందర్భంగా 25 మంది ఔత్సాహితులు, ఇన్నోవేటర్లు తెలంగాణ మొత్తం పర్యటిస్తూ శుక్రవారం తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామానికి చేరుకున్నారు. వారికి సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇన్నోవేషన్ లపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్త ఇన్నోవేషన్లకి దత్తాయిపల్లి గ్రామాన్ని దత్తత గ్రామంగా తీసుకొని గ్రామానికి, జిల్లాకు కూడా ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలని దానికి గ్రామం తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. వారు కూడా పూర్తి సహకారం ఇస్తానని టీ హబ్ తరపున అన్ని విజయ తెలిపారు.

## శ్రీ రామనవమి పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమం

- మాజీ సర్పంచ్ సోక్కుల మోహన్ రెడ్డి



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 27 :**

తుర్కపల్లి మండలం పల్లెపహాడ్, గొల్లగూడెం గ్రామాల్లో శ్రీ రామనవమి పురస్కరించుకొని రెండు గ్రామాల్లో ప్రముఖ పారిశ్రామికవేత్త, పల్లె పహాడ్ మాజీ సర్పంచ్ సోక్కుల మోహన్ రెడ్డి సహకారంతో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పల్లెపహాడ్ సర్పంచ్ పాంగల పవనీత బాలకృష్ణ, గొల్లగూడెం సర్పంచ్ ధరావత్ రమేష్, జూపల్లి కనకరాజు, దాసరి శ్రీశైలం, దాసరి బాలరాజు, అల్వాల నరసింహ, ఉప సర్పంచ్ పోరం అధ్యక్షుడు బబ్బూరి సాయికుమార్ గౌడ్, మైలారం శ్రీనివాస్, వార్డ్ మెంబర్ గూడ శ్రీలత రాజిరెడ్డి, కర్ణాకర్, బబ్బురి శ్రీనివాస్ గౌడ్ హరినాథ్ గౌడ్, వెంకటేష్ గౌడ్, యాదగిరి గౌడ్, రజినీకాంత్ గౌడ్, కిషోర్ గౌడ్, అరవింద్ గౌడ్ లక్ష్మీకాంత్ గౌడ్, భరత్ గౌడ్, శేఖర్ గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బస్టాండులోకి బస్సులు వచ్చేలా చూడండి

- ఆర్టీసీ రివ్యూ మీటింగ్ లో మంత్రిని కోరిన ఎమ్మెల్యే జీఎంఆర్



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ లోకి బస్సులు వచ్చేలా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను గురువారం రాత్రి దేవకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి కోరారు. హైదరాబాద్ లో ఆర్టీసీ రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే జిఎంఆర్ హాజరై సంబంధిత మంత్రిని ఈ సమస్యను తీర్చాలంటూ కోరారు. అలాగే దేవరకద్రలో బస్సు డిపో కూడా ఏర్పాటు చేయాలని మంత్రిని ఎమ్మెల్యే కోరారు. దీనికి స్పందించిన మంత్రి సానుకూలంగా స్పందించినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.

## బసవాయిపల్లిలో సీతారాముల కళ్యాణం



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని దేవరకద్ర మండలం బస్వాయిపల్లిలో శుక్రవారం శ్రీరామనవమిని పురస్కరించుకొని సీతారాముల కళ్యాణం మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆంజనేయస్వామి దేవాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు, ప్రజలు, మహిళలు, యువతీ, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే విశేష దినోత్సవం పురస్కరించుకొని దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



## ఆంజనేయ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్ దంపతులు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం కోయిల్ సాగర్ లో శుక్రవారం శ్రీ ఆంజనేయ స్వామి వారిని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) దర్శించుకున్నారు. శ్రీరామనవమి సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే జిఎంఆర్ దంపతులు దేవాలయానికి వెళ్లి సీతారాముల కళ్యాణం మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం అక్కడ జరిగిన పలు పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యే జిఎంఆర్ దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సీతారాముల కళ్యాణం మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే ఆల దంపతులు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని భూత్పూర్ మండలం అన్నాసాగర్ లో శుక్రవారం స్థానిక ఆంజనేయస్వామి దేవస్థానంలో జరిగిన సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవ వేడుకలకు దేవరకద్ర నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన పలు పూజా కార్యక్రమాలలో వారు పాల్గొన్నారు. కళ్యాణ మహోత్సవానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే దంపతులను ఘనంగా స్వాగతం పలికి నిర్వహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీరామనవమి వేడుకలు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని దేవరకద్ర మండలం పుట్టపల్లిలో శుక్రవారం శ్రీరామనవమి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు మఠం సురేష్ స్వామి అధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తుల అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# శ్రీరాముడి ఆశీస్సులు అందరిపై ఉండాలి

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్
- చిన్న రాజమూర్ లో సతీసమేతంగా కళ్యాణ మహోత్సవానికి హాజరు
- స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే దంపతులు



**జయభేరి, దేవరకద్ర :**

ఆ దేవదేవుడు శ్రీరాముడి ఆశీస్సులు మనందరిపై ఉండాలని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని దేవరకద్ర మండలం చిన్న రాజమూరులోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద శుక్రవారం శ్రీరామనవమి పర్వదిన వేడుకలు సందర్భంగా నిర్వహించిన సీతారాముల కళ్యాణం మహోత్సవానికి ఎమ్మెల్యే జిఎంఆర్ సతి సమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారికి ఎమ్మెల్యే జిఎంఆర్ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే దంపతులను గ్రామస్తులు, ఉత్సవ నిర్వాహకులు, పురోహితులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం అక్కడ జరిగిన పలు పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఎప్పుడు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలంటే ఆ శ్రీరామచంద్రుడి ఆశీస్సులు మనందరిపై ఉండాలన్నారు. ఆ దేవుడి కరుణ, కటాక్షాలు మనందరిపై ఉండాలన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన భక్తులతో పాటు గ్రామస్తులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, భక్తులకు ఎమ్మెల్యే జిఎంఆర్ దంపతులు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామస్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కమనీయం సీతారాముల కళ్యాణం

- ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- ఘనంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలో శుక్రవారం శ్రీరామనవమి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది నియోజక వర్గంలోని ఆయా గ్రామాలలో ఈ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా శ్రీరామనవమి వేడుకలను సాంప్రదాయ రీతిలో నిర్వహించారు.

శ్రీరామనవమి పర్వదిన వేడుకల సందర్భంగా ఆయా గ్రామాలలోని రామాలయాలు, శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాల వద్ద సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి దంపతులకు పట్టు వస్త్రాల సమర్పించి, మంగళ సూత్రధారణ కార్యక్రమాలను నిర్వహించారు. దీంతో సీతారామ చంద్రమూర్తులు అలంకరణలో భక్త కోటికి దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు భక్తులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు తదితరులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# శ్రీరామనవమి వేడుకల్లో ఎమ్మెల్యే దంపతులు

- కొత్త మొల్గర, పోతులమడుగులలో కళ్యాణ మహోత్సవానికి హాజరు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని భూత్పూర్ మండలం పాత మొల్గర, పోతులమడుగు గ్రామాలలో శుక్రవారం జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సతీసమేతంగా పాల్గొన్నారు. సందర్భంగా వారు అక్కడ జరిగిన పలు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే దంపతులను ఆయా గ్రామస్తులు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ శ్రీరాముడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


## కళ్యాణ మహోత్సవానికి హాజరైన మున్సిపల్ చైర్మన్ దంపతులు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం జరిగిన సీతారాముల కళ్యాణం మహోత్సవానికి స్థానిక మున్సిపాలిటీ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కల్యాణ మహోత్సవానికి హాజరైన మున్సిపల్ చైర్మన్ దంపతులను ఘనంగా స్వాగతం పలికి స్థానిక ఆర్యవైశ్యులు సన్మానించారు.

అనంతరం వారు దేవాలయంలో జరిగిన పలు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.



# కమనీయం సీతారాముల కళ్యాణం

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

జయభేరి, ఉప్పల్ :

శ్రీ రామ నవమి సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని పలు ఆలయాలను సందర్శించి అమ్మవారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. సీతా రాముల అన్యోన్యత, రామలక్ష్మణుల సోదరభావం, రామ సుగ్రీవుల స్నేహం, శ్రీ రామ హనుమల అనుబంధం మన పెద్దలు చిన్ననాటి నుంచి మనకు నేర్పించే విలువలు. ఆ విలువలే మనకు తరగని ఆస్తి. ఇలాంటి సంప్రదాయాలు గుర్తు చేసేది కాబట్టే శ్రీరాముడు అవతరించిన నేడు మనకు అసలైన పండుగ. అందరూ సంప్రదాయ బద్ధంగా శ్రీరామ నవమి పండుగ జరుపుకుని తరించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమి వేడుకల్లో జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.జడ్చర్ల కేంద్రం లోని పాత బజారు హనుమాన్ దేవాలయంలో శ్రీ రామనవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం భక్తుల కోలాహలం మధ్య సాగింది. జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ ఈ కళ్యాణ మహోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన స్వామివారిని దర్శించుకుని, కళ్యాణ వేడుకలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాముల వారి కళ్యాణాన్ని తిలకించేందుకు పాత బజారు ప్రాంతం నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ సీతారాముల కళ్యాణం కనులపండువగా జరిగింది.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ ను ఘనంగా సన్మానించారు.

## రంగరంగ వైభవంగా శ్రీ సీతారామచంద్ర స్వామి పల్లకి సేవ



జయభేరి, భూపాలపల్లి :

భూపాలపల్లి మంజూరు నగర్ లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పల్లకి సేవను రంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి సహస్ర దీపాలంకరణ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించగా, అనంతరం తిరువీది ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గండ్ర జ్యోతి గారు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి దర్శనం చేసుకొని కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## శ్రీ సీత రాముల వారి ఊరేగింపు



జయభేరి, కుత్బుల్లాపూర్ :

శ్రీరామనవమి సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని అయోధ్య నగర్,బీరప్ప నగర్,ఎచ్.ఏ.ఎల్ రాఘవేంద్ర కాలనీ మరియు వెంకటేశ్వర నగర్ లలో శ్రీరామనవమి సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మరియు కాలనీ కమిటీ సభ్యులు నిర్వహించిన శ్రీ సీత రాముల వారి ఊరేగింపు, పల్లకి సేవ కార్యక్రమంలో పాల్గొని తదుపరి వెన్నెల గడ్డ (బజరంగ్ హిల్స్) హనుమాన్ దేవాలయంలో శ్రీ సీత రాముల స్వామి వారి కల్యాణ మహోత్సవ కార్యక్రమం లో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి.

# ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

- స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన మాజీ మంత్రి మల్లారెడ్డి, మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి

జయభేరి, మేడిపల్లి :



మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శ్రీరామ నవమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించబడ్డాయి .ఈ సందర్భంగా మేడిపల్లిలోని శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవాలయంలో శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరుగగా, మాజీ మంత్రి, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి, మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి, అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి దివ్య ఆశీర్వాదాలు స్వీకరించారు.

అనంతరం మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్ల పరిధిలోని పలు కాలనీలలో నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాల్లో భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రతి కాలనీలో భక్తి వాతావరణం నెలకొని, జై శ్రీరాం నినాదాలతో ప్రాంతం మారోగింది. ఈ సందర్భంగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... "శ్రీరామ నవమి పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక, ప్రజలందరూ ఐక్యంగా ఇలాంటి వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడ్డి, కౌడే పోచయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, యూత్ అధ్యక్షులు ప్రభు,జావీద్ ఖాన్, యాసారం శ్రీనివాస్, ఆకుల మధుకర్, యాస రాజు,పింగళి జోగి రెడ్డి, కిరణ్ నాయక్, అమర్ పటేల్,బాలరాజు, వారికల శ్రీనివాస్, సురేష్, శంకర్ రెడ్డి, దేవాలయం చైర్మన్ కావడపు రాంరెడ్డి,కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


# శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం మన సంస్కృతి

- సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్

జయభేరి, మేడిపల్లి :



శ్రీరామనవమి సందర్భంగా మల్కాజ్గిరి కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్, బోడుప్పల్ డివిజన్ శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్, బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుగుల నర్సింహా రెడ్డి, సీతా రామాంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ బొబ్బల లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజయ్ యాదవ్ మాట్లాడుతూ.. శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యతను పెంచుతాయని అన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ మహోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయం అన్నారు. భక్తులకు మరింత సౌకర్యాలు కల్పిస్తూ, ఆలయ అభివృద్ధి కోసం అందరం కలిసి పనిచేయాలని ఆయన సూచించారు.



# శ్రీ సీతారాముల కళ్యాణం చూదాం రారండి

జయభేరి, ఘట్కేసర్ :



శ్రీ రామ నవమి పురస్కరించుకొని MMC ఘట్కేసర్ డివిజన్ లో పాలు ఆలయం లో నిర్వహించిన శ్రీ స్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామి వారికీ ప్రత్యేక పూజలు చేసిన ఘట్కేసర్ మున్సిపల్ మాజీ చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, మాజీ సర్పంచ్ వేముల మమతా, B బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్. ఈ సందర్భంగా మాజీ చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ.. ముందుగా అందరికి శ్రీ రామ నవమి శుభాకాంక్షలు తెలుపుతూ.. ఘట్కేసర్ శివారెడ్డి గూడా, బాలాజీ నగర్, ఘనపూర్, ఆర్యవైశ్య సంఘం, కరీంగూడ ఆలయాల్లో నిర్వహించిన శ్రీ రామ కల్యాణ మహోత్సవంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని.. శ్రీ రామ నవమి చైత్ర శుద్ధ నవమి నాడు జరుపుకునే అత్యంత పవిత్రమైన హిందూ పండుగ. ఇది విష్ణుమూర్తి ఏడవ అవతారమైన శ్రీరాముడు జన్మించిన రోజు ఆదర్శ జీవనం, ధర్మపాలన, సత్యనిష్ఠకు ప్రతీకగా ఈ రోజున సీతారాముల కళ్యాణం, పూజలు జరుపుతారు. రామ నామ స్మరణ, ఉపవాసాలు, దానధర్మాలు చేయడం ద్వారా పాపాలు తొలగిపోతాయని, ముక్తి లభిస్తుందని, సీతారాముల కళ్యాణం శ్రీరాముడు జన్మించిన రోజే సాయంత్రం సీతారాముల కళ్యాణం కూడా జరిగిందని పురాణాలు చెబుతున్నాయి. ఈ వివాహ మహోత్సవాన్ని చూడటం వల్ల సకల శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

**ధర్మస్థాపన:**
దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం, సత్యపాలనను భూమిపై నిలబెట్టడానికి శ్రీరాముడు అవతరించిన రోజు ఇది.

**రామకోటి - భజనలు:**
భక్తులు ఈ రోజున రామకోటి రాయడం, రామ నామ స్మరణ, రామాయణ పారాయణం చేయడం అత్యంత పుణ్యప్రదంగా భావిస్తారు.



**పానకం & వడపప్పు:**
ఈ పండుగ నాడు శ్రీరాముడికి ప్రత్యేకంగా పానకం మరియు వడపప్పు నైవేద్యంగా సమర్పిస్తారు, ఇది ఆరోగ్యానికి కూడా మంచిదని నమ్ముతారు. రామ రాజ్య పట్టాభిషేకం: రావణ సంహారం తర్వాత రాముడు అయోధ్యకు తిరిగి వచ్చి, సీతాసమేతంగా పట్టాభిషిక్తుడైన రోజు కూడా ఇదేనని అంటారు.

**భద్రాద్రి కళ్యాణం :**
తెలంగాణలోని భద్రాచలంలో సీతారాముల కళ్యాణ ఉత్సవం అత్యంత వైభవోపేతంగా, ప్రభుత్వ లాంఛనాలతో జరుగుతుంది. శ్రీరామ నవమి కేవలం రాముడి జన్మదినం మాత్రమే కాదు, "మర్యాదా పురుషోత్తముడు" అయిన రాముడి ఆదర్శాలను, సత్య, ధర్మ మార్గాలను పాటించాలని గుర్తుచేసే ఒక పవిత్రమైన పర్వదినం. ప్రతి ఒక్కరు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కమిటీ సభ్యులు, రామ భక్తులు ప్రజలు యువజన సంఘాలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆశా వర్కర్లను అరెస్టు చేస్తున్న పోలీసులు

జయభేరి, హైదరాబాద్ :

సాధించుకున్న తెలంగాణలో ఆశా వర్కర్లు చేస్తున్న సేవ వర్ణనాతీతం.. అలాంటి ఫోర్త్ గ్రేడ్ ఆశ వర్కర్లకు మూడు నెలల నుంచి జీతాలు రాకపోవడంతో వారి జీవన పరిస్థితి పూర్తిగా స్తంభించిపోయింది. దీంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆశ వర్కర్లు రాజ్యాంగం కల్పించిన హక్కు ద్వారా నిరసన తెలుపాలి అనుకున్న అది సాధ్యం కావడంలేదని ఆవేదన చెందుతున్నారు. నా కుటుంబ కష్టంగా ఉంది అని నిరసన తెలియజేయడానికి కూడా పోలీసులు సహకరించడం లేదు. ఇంట్లో ఉన్న వారిని రాత్రి అని చూడకుండా తీసుకువెళ్లి పోలీస్ స్టేషన్లో ఆడవారిని కూర్చోబెడుతున్నారు. వరంగల్ జిల్లాలో పూర్తిగా ఆశా వర్కర్ల అరెస్టులపర్వం జోరుగా కొనసాగుతుంది.. ప్రజాస్వామ్యం లో నిరసన తెలియజేసుకోవడానికి కూడా అవకాశం లేకపోవడం సాధించుకున్న తెలంగాణలో కరువైపోతుందని ఆశ వర్కర్లు తమ గోడును వెళ్ళబోసుకుంటున్నారు.

## చెరువులో పడి యువకుడి మృతి

జయభేరి, హయత్ నగర్ :

బాచిగళ్ళ అభిలాష్ తండ్రి శంకరయ్య (16), వృత్తి స్టూడెంట్ 27 నాడు మధ్యాహ్నం 03:00 గంటలకు తన ఫ్రెండ్స్ తో కలసి బయటకు వెళ్ళినాడు. ఆ తర్వాత మధ్యాహ్నం 03:30 గంటల సమయంలో తొర్రూర్లో వాళ్ళ ఇంటి పక్కన ఉండే సువర్ణ అనే ఆవిడ అభిలాష్ వాళ్ళ ఇంటికి వచ్చి తన కొడుకు బాల శివకుమార్ తనకి కాల్ చేసి అభిలాష్, మరికొంత మంది కలిసి తొర్రూరులోని మంగళగుంట చెరువులో ఈతకు వెళ్లగా అభిలాష్ చెరువులో మునిగినాడని, బయటకు రాలేదు అని చెప్పినాడు అని అభిలాష్ వాళ్ళ నాన్న శంకరయ్యకి చెప్పగా శంకరయ్య వెంటనే చెరువు దగ్గరికి వెళ్లి వెతకగా అభిలాష్ దొరికినాడు అని, వెంటనే అభిలాష్ ని అంబులెన్స్ లో వనస్థలిపురం ఏరియా హాస్పిటల్ కి తరలించగా అక్కడ డ్యూటీ డాక్టర్ పరీక్షించి అప్పటికే అభిలాష్ చనిపోయాడని తెలిపినారని చెప్పి ఇట్టి విషయంలో చట్టపరంగా విచారణ చేయవలసినదిగా కోరటం జరిగినది.

## ఎంపి ఈటల శ్రీరామనవమి పూజలు



జయభేరి, సికింద్రాబాద్ :

శ్రీరామనవమిని పురస్కరించుకుని కంటోన్మెంట్ లోని పలు రామ మందిరాలలో జరిగిన శ్రీసీతారామ కళ్యాణ మహోత్సవంలో మల్కాజ్ గిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించారు. వివిధ రకాల పూలు పండ్లు అలంకరణలతో రామాలయాలు శోభాయామానంగా ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. శ్రీ సీతారాముల కళ్యాణాన్ని చూసేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు.



# నెల రోజుల పాటు.. చక్కెర తినడం మానేసి చూడు

హైదరాబాద్ ఫిబ్రవరి 3 :

**మనం తీసుకునే ఆహారంలో చక్కెర ఒక భాగమైనదని చెప్పవచ్చు. ఉదయం నిద్రలేచింది మొదలు సాయంత్రం నిద్రించే వరకు ఏదో ఒక రూపంలో చక్కెరను తీసుకుంటూనే ఉంటాం. టీ, కాఫీ, జ్యూస్, స్వీట్స్, కుక్కీస్ ఇలా ఏదో ఒక రూపంలో చక్కెర మన శరీరంలోకి వెళ్తూనే ఉంటుంది. అయితే చక్కెరను తీసుకోవడం 30 రోజుల పాటు మానేయడం వల్ల మనం అనేక శారీరక, మానసిక మార్పులను గమనించవచ్చని వైద్యులు చెబుతున్నారు. అయితే చక్కెరను మానేసిన తరువాత మొదట్లో మనం కొన్ని ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. చక్కెరను తీసుకోవడం మానేసిన తరువాత చిరాకు, అలసట, ఆందోళన వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. మెదడు చక్కెర అందించే డోపమైన్ హిట్ ను కోల్పోవడం వల్ల ఇలా జరుగుతుంది. చక్కెర తీసుకోవాలనే కోరిక ఎక్కువగా ఉంటుంది. శరీరం నెమ్మదిగా చక్కెరకు దూరం అయ్యే కొద్దీ ఈ కోరికలు తగ్గుతూ వస్తాయి.**

### కొవ్వు కరుగుతుంది..

డిటాక్స్ ట్రెండ్ కంటే ఎక్కువగా చక్కెరను తీసుకోకపోవడం వల్ల మన శరీరానికి కలిగే మేలే ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఇలా చక్కెరను తీసుకోవడం తగ్గించడం వల్ల క్రమంగా రెండవ వారం నాటికి రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది. రక్తంలో గ్లూకోజ్ మరింత సమర్థవంతంగా నిర్వహించబడుతుంది. ఇన్సులిన్ స్థాయిలు తగ్గడంతో శరీరం నిల్వ ఉన్న కొవ్వును కరిగించడం ప్రారంభిస్తుంది. తద్వారా శరీర బరువు తగ్గుతుంది. ఇక మూడవ వారం కూడా చక్కెరను తీసుకోవడం మానేయడం వల్ల మనం దీర్ఘకాలిక ప్రయోజనాలనుగమనించవచ్చు. చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. దద్దుర్లు, మంట, మొటిమలు, పగుళ్లు వంటివి తగ్గుతాయి. అకాల వృద్ధాప్యం రాకుండా ఉంటుంది. రక్తంలో చక్కెర క్రాష్ లు తగ్గడం వల్ల మనం మరింత స్థిరంగా దృష్టి కేంద్రీకరించవచ్చు.

### కొలెస్ట్రాల్ అదుపులో..

క్యాలరీలు తీసుకోవడం తగ్గడం వల్ల శరీర బరువు తగ్గడాన్ని మనం ఎక్కువగా గమనించవచ్చు. అంతేకాకుండా అధిక కొలెస్ట్రాల్, ఫ్యాటీ లివర్ వంటి కాలేయ వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుందని వైద్యులు తెలియజేస్తున్నారు. ఇక చక్కెర ఉండే స్వీట్లు, పానీయాలు, బేక్ చేసిన వస్తువులు తీసుకోవడం తగ్గించడం వల్ల ప్రజలు పండ్లు, గింజలు వంటి వాటిని తీసుకోవడానికి మొగ్గు చూపుతారు. దీంతో శరీరానికి కావల్సిన పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి. చక్కెర కలిగిన ఆహార పదార్థాలకు బదులుగా నానబెట్టిన ఖర్జూరాలు, పెరుగు వంటి వాటిని తీసుకోవడం వల్ల బరువు అదుపులో ఉంటుంది. పేగు ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

### ఉత్సాహంగా మారుతారు..

అంతేకాకుండా చక్కెరలో వచ్చే హెచ్చుతగ్గులు బద్ధకం, చిరాకుకు కారణమవుతాయి. కనుక చక్కెరను మానేయడం వల్ల మనం ఉత్సాహంగా ఉండడంతో పాటు మానసికంగా ఉత్సాహంగా ఉండవచ్చు. ఇలా నెలరోజుల పాటు చక్కెర తీసుకోవడం మానేయడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు. చక్కెర మానేయడం తాత్కాలికంగానే కాకుండా స్థిరమైన జీవనశైలి ఎంపికగాఉండాలని వారు సూచిస్తున్నారు. చక్కెరకు బదులుగా బెల్లం, తేనె, ఖర్జూరం వంటి వాటిని మితంగా తీసుకోవాలి. అలాగే తీపి వంటకాల తయారీలో చక్కెరకు బదులుగా యాలకులు, దాల్చిన చెక్క వంటి వాటిని వాడడం వల్ల తీపి తింటున్నామన్న అనుభూతి పెరుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు.



# జంక్ ఫుడ్ మానేస్తే.. మీ ముఖంలో కనిపించే మార్పులు

**జంక్ ఫుడ్ ఆరోగ్యానికి మంచిది కాదని అందరికీ తెలుసు. అయినా సరే చాలామంది ఆ ఫుడ్ నే ఇష్టంగా తింటుంటారు. కానీ జంక్ ఫుడ్ ని ఒక 30 రోజులు మానేస్తే మీ శరీరంలో ఎన్ని మార్పులు జరుగుతాయో తెలుసా? ముఖ్యంగా ఫేస్ లో కనిపించే ఈ మార్పులు చూస్తే షాక్ అవుతారు.**

### 30 రోజులు జంక్ ఫుడ్ మానేస్తే..

మనలో చాలామంది ఫాస్ట్ ఫుడ్, ప్యాకేజ్డ్ స్నాక్స్, కేక్‌లు, చిప్స్ వంటి పదార్థాలను ఇష్టంగా తింటుంటారు. కానీ అవి మన శరీరం, ముఖ్యంగా చర్మంపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో తెలుసా? ఆరోగ్య నిపుణులు, స్కిన్ కేర్ ఎక్స్‌పర్ట్‌ల ప్రకారం కేవలం 30 రోజులు జంక్ ఫుడ్ మానేయడం ద్వారా ముఖంలో కలిగే మార్పులేంటో ఇక్కడ తెలుసుకుందాం.

### మృదువుగా మారుతుంది

జంక్ ఫుడ్ ఎక్కువగా సాచ్యూరేటెడ్ ఫ్యాట్స్, షుగర్, ప్రాసెస్డ్ పదార్థాలను కలిగి ఉంటుంది. ఇది చర్మంలో ఇన్ఫ్లమేషన్ ను పెంచుతుంది. ముడతలు, ఎరుపు, పొడిబారడం వంటి సమస్యలకు కారణమవుతుంది. జంక్ ఫుడ్ మానేసిన వెంటనే, శరీరంలోని ఇన్ఫ్లమేటరీ రియాక్షన్స్ తగ్గుతాయి. 30 రోజుల్లో చర్మం సహజంగా హైడ్రేటెడ్ గా, మృదువుగా మారుతుంది. ముఖ్యంగా కేకులు, కోల్డ్ డ్రింక్స్, చిప్స్ మానడం వల్ల చర్మం.. లోపలి తేమను నిలుపుకోవడానికి అవకాశం ఉంటుంది.

### కొల్లాజెన్ ఉత్పత్తిపై ప్రభావం

షుగర్ అధికంగా తీసుకోవడం వల్ల చర్మంలోని కొల్లాజెన్ దెబ్బతింటుంది. కొల్లాజెన్ శక్తిని కోల్పోవడం వల్ల చర్మంపై ముడతలు మొదలవుతాయి. 30 రోజులు జంక్ ఫుడ్ మానేయడం ద్వారా, కొల్లాజెన్ ఉత్పత్తి సక్రమంగా ఉంటుంది. దానివల్ల చర్మం స్థిరంగా ఉంటుంది, ముడతలు తగ్గుతాయి. కాంతివంతంగా మారుతుంది.

### ముఖం స్లిమ్ గా కనిపించడం

జంక్ ఫుడ్ ఎక్కువగా సోడియం, ఫ్యాట్, ప్రాసెస్డ్ పదార్థాలను కలిగి ఉంటుంది. ఇది శరీరంలో వాటర్ రిటెన్షన్, మలినాలు, ఫేస్ బ్లోటింగ్ కు కారణమవుతుంది. ఆరోగ్య నిపుణుల ప్రకారం, 30 రోజులు జంక్ ఫుడ్ మానేసి.. సరైన ఆహారం తీసుకోవడం ద్వారా ఫేస్ బ్లోటింగ్ తగ్గి ముఖం స్లిమ్ గా కనిపిస్తుంది. అలాగే, యాంటీ ఆక్సిడెంట్‌లు ఎక్కువగా ఉండే ఫుడ్స్ తీసుకోవడం వల్ల చర్మం లోపలి నుంచి మెరుగుపడుతుంది.

### ముఖం ఫ్రెష్ గా..

జంక్ ఫుడ్ లోని ఫ్యాటీ, ప్రాసెస్డ్ పదార్థాలు శరీరంలోని యాంటీఆక్సిడెంట్ స్థాయిలను తగ్గిస్తాయి. చర్మం యూవీ కిరణాల ప్రభావానికి లోనవుతుంది. జంక్ ఫుడ్ మానేసి.. ఇతర ఫ్రూట్స్, వెజిటబుల్స్ తీసుకుంటే వాటిలోని యాంటీ ఆక్సిడెంట్‌లు చర్మ రికవరీని వేగవంతం చేస్తాయి. సన్ డ్యామేజ్ తగ్గి, చర్మం తాజాగా మారుతుంది.

### ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

చర్మంలో కనిపించే ఈ మార్పులు మానసికంగా పెద్ద మార్పులకు దారితీస్తాయి. 30 రోజులు జంక్ ఫుడ్ మానేస్తే.. ముఖం స్పష్టంగా మెరుస్తుంది, చర్మం ఆరోగ్యంగా కనిపిస్తుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. జంక్ ఫుడ్ మానేయడం ఒక్క చర్మ ఆరోగ్యానికే కాదు.. మొత్తం శరీర ఆరోగ్యానికి మేలు చేస్తుంది.



# జుట్టుకు ఎన్ని రోజులకు ఒకసారి ఆయిల్ రాయాలి?

**జుట్టు ఒత్తుగా, ఆరోగ్యంగా పెరగడానికి మనం తలకు నూనె రాస్తుంటాం. తలపై నూనెతో స్మూత్ గా మసాజ్ చేస్తే ప్రశాంతంగా అనిపిస్తుంది. జుట్టు కుదుళ్లు కూడా బలపడతాయి. జుట్టు చక్కగా పెరగాలంటే ఎన్ని రోజులకు ఒకసారి నూనె రాయాలి? నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసా?**

మనం జుట్టుకు రెగ్యులర్ గా నూనె రాస్తుంటాం. దానివల్ల జుట్టు ఒత్తుగా, ఆరోగ్యంగా పెరుగుతుంది. కానీ జుట్టుకు ఎన్ని రోజులకు ఒకసారి ఆయిల్ రాయాలి? రోజూ రాయడం మంచిదా? లేక వారంలో ఒకటిరెండు సార్లు రాస్తే సరిపోతుందా? నిపుణులు ఏం చెబుతున్నారో ఇక్కడ వివరంగా తెలుసుకుందాం.

### వారానికి 1-2 సార్లు

ఆరోగ్య నిపుణుల ప్రకారం జుట్టుకు వారానికి 1-2 సార్లు ఆయిల్ రాయడం మంచిది. సాధారణ లేదా డ్రై హెయిర్ ఉన్నవారు వారానికి రెండు సార్లు రాసుకోవచ్చు. ఆయిలీ స్కాల్ప్ ఉన్నవారు వారానికి ఒకసారి జుట్టుకు నూనె రాస్తే సరిపోతుంది. దానివల్ల స్కాల్ప్ ఉత్పత్తి చేసే సహజ నూనెలపై చెడు ప్రభావం పడదు.

### రోజూ రాస్తే ఏమవుతుంది?

సాధారణంగా చాలామంది రోజూ నూనె రాసుకుంటే జుట్టు బాగా పెరుగుతుందని అనుకుంటారు. కానీ దానివల్ల హెయిర్ ఫోలికల్స్ బలహీనపడే అవకాశం ఉంది. అంతేకాదు దుమ్ము, ధూళి వంటివి తలపై చేరి చర్మ రంధ్రాలు మూసుకుపోతాయి. ఫలితంగా చుండ్రు, ఇరిటేషన్, హెయిర్ ఫాల్ వంటి సమస్యలు ఎదురవుతాయి.

### నూనె వేడి చేసి రాస్తే..

ఆయిల్ వాడటం వల్ల జుట్టుకు హైడ్రేషన్ లభిస్తుంది. తలపై స్మూత్ గా మసాజ్ చేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగవుతుంది. అయితే చాలామంది నూనెను కొద్దిగా వేడి చేసి జుట్టుకు అప్లై చేస్తుంటారు. గోరువెచ్చని నూనెతో తలపై మసాజ్ చేస్తే.. జుట్టులోకి సులభంగా ఇమిడిపోతుంది. అలాగే రక్తప్రసరణ మెరగవుతుంది. కానీ నూనెను ఎక్కువ వేడి చేయడం మంచిది కాదు. అదే విధంగా జుట్టుపై బలంగా రుద్దడం కూడా ప్రమాదకరం అని నిపుణులు సూచిస్తున్నారు.

### ఎక్కువసేపు ఉంచితే?

జుట్టుకు నూనె రాసిన తర్వాత మరీ ఎక్కువసేపు ఉంచకూడదు. 45 నిమిషాల నుంచి 2 గంటల వరకు ఉంచితే సరిపోతుంది. దానికంటే ఎక్కువసేపు ఉంచితే.. ప్రయోజనాల కంటే నష్టాలే ఎక్కువని నిపుణులు చెబుతున్నారు. ఫంగల్ ఇన్ఫెక్షన్లు, చుండ్రు, జుట్టు రాలడం వంటి సమస్యలు ఎదురవుతాయని సూచిస్తున్నారు.

### ఏ నూనె వాడొచ్చు?

నిపుణుల ప్రకారం జుట్టు రకాన్ని బట్టి నూనెను ఎంచుకోవాలి. పొడి జుట్టుకు కొబ్బరి నూనె వాడొచ్చు. కొబ్బరినూనె జుట్టు లోపలి వరకు చొచ్చుకుపోయే గుణాలను కలిగి ఉంటుంది. అలాగే మందపాటి జుట్టుకు బాదం నూనె, జుట్టు పెరుగుదలకు ఆముదం నూనె వంటివి వాడొచ్చు.





## ‘ఆ వీడియో బయటికి తీసి నాపై కుట్ర..’


బిగ్ బాస్ తెలుగు రియాలిటీ షో ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్న వారిలో స్రవంతి చొక్కారపు ఒకరు. బిగ్ బాస్ నాన్ స్టాప్2022, బిగ్ బాస్ సీజన్ 72023 లలో... రెండు సార్లు కంటెస్టెంట్ గా పార్టిసిపేట్ చేసిన ఈమె తన ఆట, మాట తీరుతో బుల్లి తెర ఆడియెన్స్ కు బాగా చేరువైంది. విజేతగా నిలవకున్నా ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుంది. బిగ్ బాస్ హౌస్ నుంచి బయటకు వచ్చిన ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు టీవీ షోస్, సినిమా ఈవెంట్స్ తో బిజీ బిజీగా గడుపుతోంది. ప్రస్తుతం తెలుగులో బిజీయెస్ట్ యాంకర్ గా ఉన్న స్రవంతి సిల్వర్ స్క్రీన్ పై కూడా కనిపించింది. రీసెంట్‌గా సినిమాల్లోకి కూడా ఎంట్రీ ఇచ్చింది. ఇక ఈక్రమంలోనే ఆమెకు సంబంధించిన ఓ బెట్టింగ్ వీడియో తెగ వైరల్ అవుతోంది. దీంతో స్రవంతి.. తనపై కుట్ర చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేసింది. సదరు కాంట్రవర్సీ వీడియోపై క్లారిటీ ఇస్తూ.. అది ఇప్పటి ది కాదని, చాలా కాలం క్రితం చేసిన పాత ప్రమోషన్ అని స్రవంతి స్పష్టం చేసింది. తనకు వీటిపై సరైన అవగాహన లేని టైంలో చేసిన తప్పని చెప్పుకొచ్చింది. కానీ ఇప్పుడు కావాలనే ఆ పాత వీడియోను మళ్ళీ వైరల్ చేయడాన్ని తప్పుబట్టింది. కొందరు కావాలనే ఈ పాత వీడియోని తెరపైకి తెచ్చి తనను టార్గెట్ చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేసింది. అంతేకాదు ఈ వీడియోకు సంబంధించిన పూర్తి వివరాలను, వివరణను ఇప్పటికే సంబంధిత అధికారులకు సమర్పించినట్లు స్రవంతి వెల్లడించింది. చట్టపరంగా చేయాల్సిన ప్రతి పనిని పూర్తి చేశానని, ఇప్పుడు కొత్తగా దీనిపై చర్చించాల్సిన అవసరం లేదని ఆమె తేల్చి చెప్పింది. ఈ క్రమంలోనే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆ పాత వీడియోలను చూసి మోసపోవద్దని తన అభిమానులకు , సామాన్య ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఆ వీడియో ఎక్కడ కనిపించినా వెంటనే ‘రిపోర్ట్’ చేయమని చేతులు జోడించి మరీ రిక్వెస్ట్ చేసింది.



## సంక్రాంతికి కలుద్దాం!


ఈ ఏడాది ‘మన శంకర వరప్రసాద్‌గారు’ చిత్రంతో బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టారు దర్శకుడు అనిల్ రావిపూడి. ఈ నేపథ్యంలో వెంకటేష్, కల్యాణ్‌రామ్‌లతో ఆయన తెరకెక్కించబోతున్న భారీ మల్టీస్టారర్‌పై ఇప్పటికే హైప్ క్రియేట్ అయింది. షైన్‌స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ దశలో ఉంది. త్వరలో లాంచింగ్ డేట్‌తో పాటు టైటిల్ వివరాలను తెలియజేయనున్నారు. దర్శకుడు అనిల్ రావిపూడి శైలిలో వినోదం, ఫ్యామిలీ ఎమోషన్స్ కలబోసిన చిత్రమిదని, వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. ఎఫ్2, ఎఫ్3, సంక్రాంతికి వస్తున్నాం, మన శంకరవరప్రసాద్‌గారు..వంటి హిట్ చిత్రాల తర్వాత వెంకటేష్‌అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రాబోతున్న ఐదవ సినిమా ఇదే కావడం విశేషం. అలాగే ‘పటాస్’తర్వాత కల్యాణ్‌రామ్‌తో అనిల్ రావిపూడి చేస్తున్న రెండో చిత్రమిది. తనకు బాగా కలిసొచ్చిన సంక్రాంతి సీజన్‌లోనే దర్శకుడు అనిల్ రావిపూడి ఈ సినిమా రిలీజ్‌కు సిద్ధం కావడం మరో విశేషం. ఈ చిత్రానికి సమర్పకులు: సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, రచనదర్శకత్వం: అనిల్ రావిపూడి.

## ప్రతి హృదయం కథ




దీపక్ సరోజ్ హీరోగా రూపొందుతున్న చిత్రం ‘శ్రీమహా విష్ణు’. ‘ప్రతి హృదయానికీ ఒక కథ ఉంటుంది’ అనేది ఉపశీర్షిక. అనైరా గుప్తా, దీప్సిక కథానాయికలు. హరిహరన్ గోధగాని దర్శకత్వంలో శ్రీహరి తన్నీరు నిర్మిస్తున్న ఈ రొమాంటిక్ డ్రామా షూటింగ్ పూర్తి చేసుకొని, పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. ప్రచారంలో భాగంగా ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ని శుక్రవారం మేకర్స్ విడుదల చేశారు. నాయకానాయికల మధ్య ఉన్న ప్రేమబంధాన్ని ఈ ఫస్ట్‌లుక్ ఆవిష్కరిస్తున్నది. ప్రేమ, బాధ్యత, ఆత్మశోధన వంటి అంశాలను ఆవిష్కరించే అద్భుతమైన ప్రేమకథ ఇదని, దీపక్ సరోజ్ ఇందులో యువ చిత్రకారుడిగా భావోద్వేగపూరితమైన పాత్రలో కనిపిస్తారని మేకర్స్ చెబుతున్నారు. రఘుబాబు, సుదర్శన్, రచ్చ రవి, జబర్దస్త్ ఆది తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సురేష్ రగుతు, సంగీతం: అనూప్ రూబెన్స్, నిర్మాణం: శ్రీలక్ష్మీనరసింహా ఆర్ట్స్.

## ఏప్రిల్‌లో నిశ్చితార్థం, అదే నెలలోనే వివాహం!



టాలీవుడ్‌లో మరో యంగ్ హీరో పెళ్లి బంధంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యారు. ప్రముఖ నిర్మాత బెల్లంకొండ సురేష్ తనయుడు, హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ త్వరలో వివాహం చేసుకోనున్నారు. ప్రత్యేకత ఏమిటంటే, ఎలాంటి హడావిడి లేకుండా సింపుల్‌గా ఈ పెళ్లిని జరపాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే తనకు కాబోయే జీవిత భాగస్వామి కావ్య రెడ్డిని సాయి శ్రీనివాస్ అధికారికంగా పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఇరు కుటుంబాలు కలిసిన వేడుక ఎంతో ఆనందంగా జరిగింది. అయితే అది ఎంగేజ్మెంట్ అంటూ వచ్చిన వార్తలను సాయి శ్రీనివాస్ ఖండించారు. అది కేవలం కుటుంబ సభ్యుల మధ్య జరిగిన చిన్న పరిచయ కార్యక్రమమేనని ఆయన స్పష్టం చేశారు. ఇప్పుడు అధికారికంగా నిశ్చితార్థానికి సిద్ధమవుతున్నారు. ఏప్రిల్ 5న హైదరాబాద్లో సాయి శ్రీనివాస్‌కావ్యల ఎంగేజ్మెంట్ జరగనుంది. ఈ వేడుకను ఇరు కుటుంబాల పెద్దలు, అత్యంత సన్నిహితుల సమక్షంలో నిర్వహించనున్నారు. టాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖులకు కూడా ఆహ్వానం పంపనున్నట్లు సమాచారం.

వివాహ వేడుక విషయానికి వస్తే, ఏప్రిల్ 29న తిరుపతిలో సాదాసీదాగా పెళ్లి జరపాలని నిర్ణయించారు. ఏడుకొండల వాడి సన్నిధిలో ఈ జంట వివాహ బంధంతో ఒక్కటవనున్నారు. అనంతరం మే 1న హైదరాబాద్లో సినీ ప్రముఖుల కోసం గ్రాండ్ రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సెలబ్రిటీ వెడ్డింగ్స్ అంటే డెస్టినేషన్ వెడ్డింగ్స్, ప్రీవెడ్డింగ్ పార్టీలు, బ్యాచిలర్ సెలబ్రేషన్స్ వంటి హంగామా ఎక్కువగా కనిపిస్తున్న వేళ, సాయి శ్రీనివాస్ మాత్రం సింపుల్ వెడ్డింగ్‌ను ఎంచుకోవడం విశేషంగా మారింది. ఈ నిర్ణయం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కావ్య రెడ్డి విషయానికి వస్తే, ఆమెకు సినీ ఇండస్ట్రీతో ఎలాంటి సంబంధం లేదు. ప్రముఖ న్యాయవాది కుమార్తె అయిన ఆమెతో సాయి శ్రీనివాస్ కొంతకాలంగా ప్రేమలో ఉన్నారు. కుటుంబ సభ్యులను ఒప్పించి ఇప్పుడు వివాహం చేసుకోబోతున్నారు. మార్చి ప్రారంభంలో జరిగిన చిన్న వేడుకలో ఆమెను పరిచయం చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇక సినిమాల పరంగా చూస్తే, గతేడాది వచ్చిన ‘భైరవం’, ‘కిష్కింధ పురి’ చిత్రాలతో మంచి విజయాలు అందుకున్న సాయి శ్రీనివాస్ ఈ ఏడాది వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో ‘హైందవ’, లో కమాన్య దర్శకత్వంలో ‘రామమ్’, అలాగే సాగర్ కె చంద్ర దర్శకత్వంలో ‘టైసన్ నాయుడు’ వంటి చిత్రాల్లో నటిస్తున్నారు. త్వరలో ఈ సినిమాలకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ రానున్నాయి.

## ఆదర్శ కుటుంబంలోకి మరో హీరోయిన్..

ఆదర్శ కుటుంబం సినిమాలో టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డే సైతం నటించనున్నట్లు సమాచారం. ఇదివరకు త్రివిక్రమ్ తెరకెక్కించిన పలు చిత్రాల్లో పూజా హెగ్డే నటించింది. వీరిద్దరి కాంబోలో వచ్చిన అరవింద సమేత వీర రాఘవ, అల వైకుంఠపురంలో చిత్రాలు మంచి విజయాన్ని సాధించాయి. ఆ తర్వాత గుంటూరు కారం సినిమాలోనూ ఈ అమ్మడు నటించాల్సింది. కానీ అనుహ్యంగా ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకుంది. ఆ తర్వాత పూజా హెగ్డే కెరీర్ నెమ్మదిగా స్లో అయ్యింది. ఆమె నటించిన చిత్రాలన్నీ ఫ్లాప్ కావడం.. అవకాశాలు తగ్గిపోవడం జరిగింది. చాలా కాలంగా వరుస ఆఫర్స్ అందుకుంటున్న పూజా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తుంది. ఈ క్రమంలో మరోసారి త్రివిక్రమ్ సినిమాలో ఛాన్స్ వచ్చినట్లు తెలుస్తోంది. ఆదర్శ కుటుంబం సినిమాలో మరో కథానాయిక కోసం పూజా పేరును ఎంపిక చేసేందుకు మేకర్స్ ప్రయత్నిస్తున్నారని టాక్. ఇప్పటికే మెయిన్ హీరోయిన్ శ్రీనిధి కాగా.. పూజా స్పెషల్ సాంగ్ చేయనున్నట్లు సమాచారం. ఈ సినిమాపై మొదటి నుంచి మంచి క్యూరియాసిటి నెలకొంది. ఈ చిత్రాన్ని హారిక & హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్నారు.



Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**